Follow: @ANNTELUGU

13-11-2024

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 302 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/9316  WWW.EPAPER.MAHAADAILY.COM


## ఆ కుటుంబం దేశాన్ని పాలించడానికే పుట్టామనుకుంటోంది



- కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ విమర్శలు
- డబుల్ స్పీడ్‌తో మహారాష్ట్రను అభివృద్ధి చేశాం

02

## మహారాష్ట్రకు జనసేనాని



- పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం ఫిక్స్
- ఎన్డీయే కూటమి కోసం ప్రచారం చేయనున్న ఏపీ డిప్యూటీ సీఎం

02

## అసెంబ్లీకి వెళ్లే ధైర్యం జగన్‌కు లేదా?



- వెళ్లకపోతే రాజీనామాలు చేయండి
- వైసీపీ ఎమ్మెల్యేలకు షర్మిల లేఖ

02



గవర్నర్ అనుమతి రాగానే

## ఈ రేసు స్కాంలో చర్యలు


### ఢిల్లీలో సీఎం రేవంత్ సంచలన ప్రకటన

అరెస్ట్ భయంతో కేటీఆర్ ఢిల్లీ వచ్చారు

అధికారులపై దాడి చేసిన వారిని ఉపేక్షించం

వివరాలు 2లో

---



శారీరక, మానసిక ప్రశాంతతకు కేరాఫ్..

## భూటాన్‌లో ఆనంద నగరం

స్మార్ట్ సిటీ, ఫార్మా సిటీ, సైబర్ సిటీ, హైటెక్ సిటీ.. ఇలా ఎన్నెన్నో కొంగొత్త నగరాల గురించి తరుచూ వినే ఉంటాం. అయితే, పొరుగు దేశం భూటాన్‌లో మైండ్‌ఫుల్‌నెస్ సిటీ నిర్మాణాన్ని అక్కడి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నది. దీన్ని ఆనంద నగరంగా కూడా పిలుస్తున్నారు.

వివరాలు 7లో



## భారత్ బోణీ

### మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

రాజ్‌గిర్(బీహార్): మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ)లో భారత హాకీ జట్టు బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో 4-0తో మలేషియాను ఓడించింది.

వివరాలు 8లో

---

# పదిరోజుల ముందే దాడికి ప్లాన్



### తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం

- 42 సార్లు సురేష్‌తో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే పట్నం
- ఆరుసార్లు కేటీఆర్‌తో మాట్లాడిన పట్నం నరేందర్ రెడ్డి
- ఓ వైపు సురేష్‌తో మరోవైపు కేటీఆర్‌తో పట్నం ఫోన్ సంభాషణ
- వికారాబాద్ కలెక్టర్‌పై దాడి కేసులో విస్తుపోయే నిజాలు
- లగచర్ల ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీస్ శాఖ
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కుట్ర- ఎంపీ మల్లు రవి
- అతను మా కార్యకర్తే.. దాడిని ఖండిస్తున్నా- బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అసలు వికారాబాద్ లో దాడి వెనుక పెద్దల పథక రచన ఉందా? ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర ఉందా? భారీ ప్రణాళిక మిస్ అయిందా? అసలేం జరిగింది. అది రైతుల ఉద్వేగమా? రాజకీయతంత్రమా? నిజాలేమైనా ఈ దాడి రాష్ట్రంలో సంచలనమైంది. అసలు పోలీసు అధికారులు.. నిఘా వర్గాలు ఏం చేస్తున్నాయి? ముఖ్యమంత్రి నియోజకవర్గంలో పరిస్థితులు.. పథకాలను గ్రహించడం లేదా? అన్న మరో చర్చ కూడా జరుగుతోంది. జిల్లా అత్యున్నత అధికారిపైనే దాడికి తెగబడే ధైర్యం సామాన్యులకు వచ్చేది కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు.

- వికారాబాద్, హైదరాబాద్, మహా


వివరాలు 2లో



దాడి ఘటనపై

## సీఎం సీరియస్

- ఎంతటి పెద్ద వ్యక్తులున్నా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశం
- రంగంలోకి మంత్రి శ్రీధర్ బాబు
- కలెక్టర్, ఐజీ, ఎస్పీలతో భేటీ
- కుట్రకోణం ఉంది- ఎస్పీ సత్యనారాయణ



వికారాబాద్, మహా: వికారాబాద్ కలెక్టర్ పై దాడి వ్యవహారంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. అధికారులపై దాడి వెనుక ఎంతటి పెద్ద వ్యక్తులున్నా, కుట్రలున్నా చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సీఎం ఆదేశాలతో మంత్రి శ్రీధర్ బాబు రంగంలోకి దిగగా, మరోవైపు ఐజీ, ఎస్పీ విచారణ చేపట్టారు. దాడి వెనుక కుట్రకోణం ఉందని జిల్లా ఎస్పీ సత్యనారాయణ అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఐజీ సత్యనారాయణతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. సురేష్ అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా దాడి చేయించారని, ప్రస్తుతం ఆరు గ్రామాల్లో పరిస్థితి అదుపులో ఉందన్నారు. ప్రజాభిప్రాయానికి వెళ్ళిన కలెక్టర్ పై దాడి ఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకోగా, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో పాటు ఐజీ, ఎస్పీలు మంత్రి శ్రీధర్ బాబు తో సమావేశమై తాజా పరిస్థితి వివరించారు.

---

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 79,360 |
| 22 క్యారెట్ | 72,750 |
| సిల్వర్ (కేజీ) | 94,000 |

| స్టాక్ మార్కెట్ | |
|---|---|
| సెన్సెక్స్ | ↗ 79,486.32 |
| నిఫ్టీ | ↗ 24,148.20 |

**ఈరోజు చికెన్ ధరలు**

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర ₹ | 160 | 200 | 210 |
| హోల్ సేల్ ధర ₹ | 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర ₹ | 5.55 | 166.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర ₹ | 5.55 | 166.5 |
| రిటైల్ గుడ్డు ధర ₹ | 5.88 | 176.49 |

---

మంత్రి లోకేశ్ కృషితో ఏపీకి

## మరో భారీ పెట్టుబడి

### రూ. 65 వేల కోట్ల పెట్టుబడులకు రిలయన్స్ ఎనర్జీ సంసిద్ధత

వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మంత్రిగా లోకేశ్ లక్ష్యం



**అమరావతి, మహా:** రాష్ట్రానికి పెట్టుబడుల కోసం మంత్రి నారా లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. రానున్న 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్‌గా లోకేశ్ ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నారు. అమెరికా పర్యటనకు ముందు ముంబైలో రిలయన్స్ సంస్థతో జరిపిన చర్చలు ఫలవంతం అయ్యాయి.

మిగతా 2లో



## తెలంగాణ సీఎం అబద్ధాలు చెప్పాడు

### మహారాష్ట్రలో కిషన్ రెడ్డి విమర్శలు

**ముంబై, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్రకు వచ్చి అబద్ధాలు చెప్పారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ముంబైలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కిషన్ రెడ్డి, ఆ తర్వాత మీడియాతో

మిగతా 2లో

## రేవంత్.. నిన్ను వదలా..

### ఢిల్లీలో కేటీఆర్ సవాల్

- అమృత్ పథకం అవినీతి నిగ్గుతేలాల్సిందే..
- కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌తో కేటీఆర్ భేటీ



**మహా, హైదరాబాద్:** ఢిల్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమృత్ పథకం అవినీతిపై కేంద్రానికి కేటీఆర్ ఫిర్యాదు చేశారు. మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మనోహర్ లాల్ కట్టర్‌ను కలిసిన కేటీఆర్.. ముఖ్యమంత్రిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

మిగతా 2లో

---

జగన్ అక్రమాస్తుల కేసులో

## బిగ్ టర్నింగ్

### మరో బెంచ్‌కు మార్చిన సుప్రీం

డిసెంబర్ 2కు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ, మహా :** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుపై దాఖలైన పిటిషన్ పై ఇవాళ సుప్రీంకోర్టులో మంగళవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్ పై కొత్తగా వచ్చిన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ పిటిషన్ కాస్తా మరో బెంచ్ విచారణకు రాబోతోంది. దీంతో ఇప్పటికే పలు మలుపులు తిరిగిన ఈ పిటిషన్ విచారణ ఇప్పుడు తాజాగా మరో టర్న్ తీసుకున్నట్లయింది.

మిగతా 2లో



## దైవ సన్నిధిలోనే మృత్యు ఒడికి

- గుడిలో ప్రదక్షిణలు చేస్తుండగా గుండెపోటు
- ఆస్పత్రికి తరలించేలోపే ఆగిన గుండె

వివరాలు 2లో

## బీజేపీని కుక్కతో పోల్చిన మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్

### బీజేపీని కుక్కలా మార్చే సమయం ఆసన్నమైందన్న నానా పటోలే

ఓబీసీలంటే బీజేపీకి ఎంతమాత్రమూ గౌరవం లేదన్న కాంగ్రెస్ చీఫ్



**ముంబై, మహా:** మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే మరో వివాదానికి తెరలేపుతూ బీజేపీని కుక్కతో పోల్చారు. అకోలాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని పడగొట్టిన బీజేపీని లక్ష్యంగా చేసుకుని మాటల దాడి చేశారు. మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తనను తాను దేవుడిగా భ్రమపడుతున్నారని విమర్శించారు. ఓబీసీ కమ్యూనిటీపై బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదన్న ఆయన..

మిగతా 2లో

# పదిరోజుల ముందే దాడికి ప్లాన్

**వికారాబాద్, హైదరాబాద్, మహా:** వికారాబాద్ కలెక్టర్‌పై దాడి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అసలు వికారాబాద్ లో దాడి వెనుక పెద్దల పథక రచన ఉందా? ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర ఉందా? భారీ ప్రణాళిక మిస్ అయిందా? అసలేం జరిగింది. అది రైతుల ఉద్వేగమా? రాజకీయతంత్రమా? నిజాలేమైనా ఈ దాడి రాష్ట్రంలో సంచలనమైంది. అసలు పోలీసు అధికారులు.. నిఘా వర్గాలు ఏం చేస్తున్నాయి? ముఖ్యమంత్రి నియోజకవర్గంలో పరిస్థితులు.. పథకాలను గ్రహించడం లేదా? అన్న మరో చర్చ కూడా జరుగుతోంది. జిల్లా అత్యున్నత అధికారిపైనే దాడికి తెగబడే ధైర్యం సామాన్యులకు వచ్చేది కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. పదిరోజుల ముందే దాడికి ప్లాన్ జరిగిందని మంత్రి శ్రీధర్ బాబు చెబుతుండగా, మరికొందరు స్థానిక మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో పాటు మాజీమంత్రి కేటీఆర్ పైనా ఆరోపణలు చేస్తున్నారు. బీఆర్ఎస్ వర్గాలు మాత్రం ఇది రైతుల ఆగ్రహంగా పేర్కొంటోంది. దాడి పేరుతో రైతులను అరెస్ట్ చేయవద్దని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అంటున్నారు. విచారణ రంగంలోకి దిగిన పోలీసులు 55మందిని అదుపులోకి తీసుకుని 16మందిని రిమాండ్ చేశారు. హైదరాబాద్ మణికొండ నుండి వచ్చి ప్రణాళిక ప్రకారం బీఆర్ఎస్ నాయకుడు సురేష్ రెచ్చగొట్టి ఈ ఘటనలో పాల్గొన్నాడని అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.






**కుట్ర స్పష్టం**

దాడి చేసేలా జనాలను రెచ్చగొట్టిన వ్యక్తిని, దాడి చేసేందుకు కుట్ర చేసిన వ్యక్తిని సురేష్‌గా పోలీసులు కనిపెట్టారు. పట్నం నరేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడిగా సురేష్ ఉన్నాడు. దాడి జరిగే కొన్ని గంటల ముందు పట్నం నరేందర్ రెడ్డితో 42 సార్లు సురేష్ మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. సురేష్‌తో మాట్లాడుతూ 6 సార్లు కేటీఆర్‌తో ఫోన్లో పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడినట్లు తెలుస్తోంది. సురేష్‌పై ఇప్పటికే రేప్ కేసుతో సహా పలు కేసులు ఉన్నాయి. ఓ అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడినందుకు అతడిపై రేప్ కేసు నమోదు అయ్యింది. సురేష్‌పై కేసులు తొలగించేలా పట్నం నరేందర్ రెడ్డి సహాయం చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ పై దాడి కేసులో నిందితుడితో మాట్లాడుతూనే మరోవైపు కేటీఆర్ తో పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడినట్లు పోలీసులు చెబుతుండడంతో కేటీఆర్ ప్రమేయంతోనే అల్లర్లుజరిగాయని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. పూర్తి విచారణలో నిజాలు తేలాల్సి ఉంది.

**దేశవ్యాప్త సంచలనం**

కలెక్టర్ పై దాడి వ్యవహారం దేశవ్యాప్త సంచలనమైంది. వికారాబాద్ జిల్లా లగ్గిచర్లలో ఫార్మా విలేజ్‌పై అభిప్రాయ సేకరణ ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన జిల్లా కలెక్టర్‌పై స్థానిక ప్రజలు దాడి చేయడం కలకలం రేపింది. అంతే కాదు కలెక్టర్, అధికారులకు సంబంధించిన మూడు కార్లను ప్రజలు ధ్వంసం చేశారు. ఈక్రమంలో గ్రామంలో తీవ్ర హైటెన్షన్ వాతావరణం నెలకొంది. జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలోని లగ్గిచర్ల, పోలేపల్లి, హీకంపేట మూడు గ్రామాల్లో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేసేందుకు మూడు వేల ఎకరాల సేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# రేవంత్.. నిన్ను వదలా..

(మొదటిపేజీ తరువాయి)



అనంతరం కేటీఆర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ... రాహుల్ గాంధీ క్రోనీ క్యాపటలిజం, అవినీతి గురించి మాట్లాడుతున్నారని.. కొందరు పారిశ్రామికవేత్తలు అధికారవర్గానికి దగ్గరగా ఉండి రూ.లక్షల కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపిస్తున్నారు... కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో సరిగ్గా ఇలాగే జరుగుతోందని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మారిందని ప్రధాని అన్నారని చెప్పారు. అలాగే తెలంగాణలో (రాహుల్-రేవంత్) ట్యాక్స్ వసూలు చేస్తున్నారని కూడా ఆరోపించారన్నారు. ''నేను ఆధారాలు తీసుకొచ్చి మీకు అందించాను. అయినా సరే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

**సొంత బామ్మర్దికి అప్పగింత..**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వందల కోట్ల రూపాయల కాంట్రాక్ట్‌ను తన సొంత బామ్మర్దికి అప్పగించారని.. రేవంత్ రెడ్డి తన సొంత బామ్మర్దికి అమృత్ పంచి, అల్లుడి కోసం కొడంగల్‌లో ఫార్మా కంపెనీ పెడుతున్నారని.. ప్రజల నుంచి తిరుగుబాటు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తెలంగాణలో ప్రజలను వంచించి ఎన్నికల హామీలు అమలు చేయకుండా మహారాష్ట్ర ఎన్నికల్లో రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ కు ఏటీఎంలాగా మారిందని స్వయంగా ప్రధాని ఆరోపించారని.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దీనిపై ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కింద పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 4 వేల కోట్ల పనులు కట్టబెడుతున్నారని... దీనిపై కూడా కేంద్రం విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినేలా..**

పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిబంధనలు ఉల్లంఘించినందుకు పదవిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో కేంద్ర ఎన్నికల సంఘం మరిన్ని చెక్ పోస్టులు పెట్టాలని... తెలంగాణ నుంచి మహారాష్ట్ర ఎన్నికలకు డబ్బులు వెళుతున్నాయని ఆరోపించారు. బీజేపీ ఎంపీలు ఒక్కరు కూడా తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎందుకు నోరు విప్పడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డి అనుభవరాహిత్యం వల్ల తెలంగాణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు నాలుగు కార్పోరేషన్లుగా విభజించాలని చూస్తున్నారని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

**రేవంత్‌పై చర్యలు తీసుకోవాల్సిందే..**

కాగా.. అధికార దుర్వినియోగం, అవినీతి నిరోధక చట్టాలను ఉపయోగించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రిని కేటీఆర్ కోరారు. అర్హత లేకపోయినా సీఎం బావమరిది శోధా కంపెనీకి రూ. 1,137 కోట్ల పనులు అప్పగించారని కేంద్ర పట్టణాభివద్ధి శాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. రేవంత్ రెడ్డి తన బావమరిదికి కేటాయించిన పనులపై పారదర్శకంగా విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## జగన్ అక్రమాస్తుల కేసులో
# బిగ్ టర్నింగ్

(మొదటిపేజీ తరువాయి)

గతంలో వైసీపీ ఎంపీగా ఉన్న సమయంలో రఘురామకృష్ణంరాజు.. పార్టీ అధిష్టానంతో విభేదించారు. అనంతరం పార్టీ అధినేత జగన్ కు గతంలో అక్రమాస్తుల కేసులో ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని, అలాగే హైదరాబాద్ సీబీఐ కోర్టులో జరుగుతున్న విచారణను మరో రాష్ట్రానికి మార్చాలని రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సుప్రీంకోర్టులోని సీజేఐ బెంచ్ లో విచారణ జరిగింది. అయితే తాజాగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ మారారు. అలాగే బెంచ్ లో ఉన్న న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ ఈ పిటిషన్లను విచారించలేనంటూ నాట్ బిఫోర్ మీ అన్నారు. దీంతో సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా అనివార్యంగా మరో బెంచ్ కు వీటిని మార్చాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో రఘురామరాజు దాఖలు చేసిన రెండు పిటిషన్లను జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని మరో బెంచ్ కు సీజే బదిలీ చేశారు. అలాగే డిసెంబర్ వీటిపై విచారణ జరిగేలా రిజిస్ట్రీకి ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఈ పిటిషన్ల విచారణ డిసెంబర్ 2కు వాయిదా పడినట్లయింది.

## తెలంగాణ సీఎం అబద్ధాలు చెప్పాడు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ... కాంగ్రెస్ చెప్పిన మోసాలను వెల్లడించేందుకే తాను మహారాష్ట్రకు వచ్చానన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 99 శాతం హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని మండిపడ్డారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టిందన్నారు. యువత, రైతులు, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు ఇలా అందరూ మోసపోయారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జోడీ తెలంగాణ ప్రజలను ఎలా మోసం చేశారో, అదే తరహాలో మహారాష్ట్రలో కూడా ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు.

## ఆ కుటుంబం దేశాన్ని పాలించడానికే
# పుట్టామనుకుంటోంది

**చంద్రాపూర్ (మహారాష్ట్ర):** దేశాన్ని పాలించడానికే తాము పుట్టామని కాంగ్రెస్ రాయల్ ఫ్యామిలీ భావిస్తోందని, ఆ పార్టీ మనస్తత్వం అదే అని ప్రధాని నరేంద్ర మోడీ ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చంద్రాపూర్‌లో నిర్వహించిన సభలో ప్రధాని మోడీ కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీల అభివృద్ధి కుంటుపడడానికి కాంగ్రెస్ కారణం అని ఆరోపించారు. రిజర్వేషన్లు అంటేనే కాంగ్రెస్ చిరాకు పడుతోందని మండిపడ్డారు. 1980వ దశకంలో రాజీవ్ గాంధీ పార్టీకి నాయకత్వం వహించినప్పుడు దళితులు, ఆదివాసీలు అనుభవిస్తున్న ప్రత్యేక హక్కులను ప్రశ్నిస్తూ ఓ ప్రకటన ప్రచురించారని గుర్తుచేశారు. దాన్ని సోషల్ మీడియాలో షేర్ చేశారని, ఇది ఆ పార్టీ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరిని ప్రతిబింబిస్తోందని ధ్వజమెత్తారు. అభివృద్ధిని అడ్డుకోవడంలో కాంగ్రెస్ డబుల్ పీహెచ్‌డీ చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్ల మహారాష్ట్ర గత రెండున్నరేళ్లలో డబుల్ స్పీడ్‌తో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఈ గడ్డపై 12 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని, 100 రైల్వేస్టేషన్లను ఆధునీకరించామని వెల్లడించారు.

## అసెంబ్లీకి వెళ్ళే ధైర్యం జగన్‌కు లేదా?

- వెళ్లకపోతే రాజీనామాలు చేయండి
- వైసీపీ ఎమ్మెల్యేలకు షర్మిల లేఖ

**అమరావతి :** ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వైసీపీ అధినేతకు, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఘాటుకు లేఖ రాశారు. అసెంబ్లీకి వెళ్లలేని ఎమ్మెల్యేలు తక్షణమే పదవులకు రాజీనామా చేయాలని మంగళవారం విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిమాండ్ చేస్తూ లేఖను విడుదల చేశారు. వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలను గమనించే ప్రజలు 11 సీట్లు ఇచ్చారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి వెళ్లనని జగన్ చెబుతున్నారు. స్వయంకృతాపరాధమేతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని గుర్తించాలని సూచించారు. వైసీపీకి 11 సీట్లు ఇచ్చిన కృతజ్ఞతనైనా ఉండాలి కదా అంటూ నిలదీశారు. అసెంబ్లీకి వెళ్లనని జగన్ అహంకారం, అజ్ఞానం బయట పడుతుందని ఆరోపించారు. బయట మాట్లాడుతాం. ఇంట్లో కూర్చుని మాట్లాడతం అంటే సరిపోదని , అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని వైసీపీ ఎమ్మెల్యేలకు సూచించారు. అసెంబ్లీ పోవడానికి ధైర్యం లేదా.. సామర్థ్యం లేదా జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి పోటికి నిలబడితే అసెంబ్లీకి వెళ్లమని , గెలిపించినా అసెంబ్లీకి వెళ్లబోమని ప్రజల నుంచి రిఫరెండం తీసుకోవాలని అన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. అసెంబ్లీకి వెళ్లకపోతే ప్రజలను మోసం చేయడం కాదా అంటూ ప్రశ్నించారు.

# దైవ సన్నిధిలోనే మృత్యు ఒడికి

**కూకట్ పల్లి, మహా :** మనిషి జీవితం నీటి బుడగ లాంటిది. ఎప్పుడు ఎటువైపు నుంచి మృత్యువు దూసుకొస్తుందో ఎవరూ ఊహించలేరు. అప్పటి వరకు ఆనందంగా, సంతోషంగా గడిపినవారు సైతం ఉన్నట్లుండి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు అనేకం. నడుస్తూ, నవ్వుతూ.. ఆడుతూ.. పాడుతూ ఇలా అప్పటిదాక అందరితో సరదాగా గడిపినవారు క్షణాల్లోనే గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా.. హైదరాబాద్ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో విషాదం చోటు చేసుకుంది. గుడిలో ప్రదక్షిణలు చేస్తూ ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. అందరూ చూస్తుండగానే దేవుని సన్నిధిలోనే మృత్యు ఒడికి చేరుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విష్ణువర్ధన్ అనే యువకుడు కేపీహెచ్ బీ రోడ్ నెంబర్ 1లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న విష్ణువర్ధన్.. ప్రతిరోజు వీరాంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి పూజలు చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ఇవాళ ఉదయం ఆలయంలో ప్రదక్షిణలు చేసేందుకు సిద్ధమయ్యాడు. అయితే గుడిలో ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో విష్ణుకు కాస్త అలసటగా అనిపించింది. దీంతో ఆలయంలో ఉన్న ఓ వాటర్ ఫిల్టర్ వద్దకు వెళ్లి మంచినీరు తాగాడు. అనంతరం తిరిగి మళ్లీ ప్రదక్షిణలు ప్రారంభించాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా గుండెపోటుకు గురై దేవ సన్నధిలోనే కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి భక్తులు, ఆలయ అర్చకులు విష్ణువర్ధకు సపర్యలు చేశారు. అయినా చలనం లేకపోవటంతో వెంటనే 108 వాహనంలో స్థానికంగా ఉన్న ఓ హాస్పిటల్‌కు తరలించారు. విష్ణువర్ధన్‌ను పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. విష్ణువర్ధన్ గుడిలో కుప్పకూలిన విజువల్స్ అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## పథకం ప్రకారమే కలెక్టర్ పై దాడి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ప్రమేయం ఎంపీ మల్లు రవి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, నవంబర్ 12:** ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయాలని పథకం ప్రకారం బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కొడంగల్‌లో భూసేకరణపై వికారాబాద్ కలెక్టర్ గ్రామస్తులతో సమావేశం అయ్యేందుకు వెళ్లారని.. బీఆర్ఎస్ నేతల ఆదేశాలతో రైతుల ముసుగులో కలెక్టర్‌పై దాడి చేశారని.. దీనిపై అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రాకపోవడంతో ఇలాంటి పనులు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని చూపించాలనే డ్రామాలో భాగంగానే కొడంగల్ ఘటన చేశారని ఆరోపించారు. ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యేకు నిమిషనిమిషానికి ఫోన్లు చేసి, మందు సేవించి కలెక్టర్‌పై దాడి చేశారన్నారు.

# మహారాష్ట్రకు జనసేనాని

**గుంటూరు, మహా:** మహారాష్ట్రలో తెలుగుపవనాల ప్రకంపనలు. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ను దేశవ్యాప్తంగా తమ తురుపు ముక్కగా భావిస్తున్న ఎన్డీఏ ప్రచారానికి ఆహ్వానించింది. ఇటీవల ఢిల్లీకి ఆహ్వానించిన బీజేపీ అధిష్ఠానం మహారాష్ట్ర ఎన్నికల్లో జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. తెలుగు వారు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ తో ప్రచారం చేయించనుంది. ఈ నెల 16, 17 తేదీల్లో పవన్ కల్యాణ్ మహారాష్ట్రలో వివిధ ప్రాంతాల్లో బీజేపీ కోసం ప్రచారం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన విషయం తెలిసిందే. ఎన్డీయే కూటమిలో భాగమైన జనసేన.. ప్రస్తుతం మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీకి సహకరించనుంది. రెండు రోజుల పాటు ప్రచారం చేసేందుకు పవన్ కల్యాణ్ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇందుకోసం బీజేపీ సీనియర్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. పవర్ స్టార్ కు ఉన్న క్రేజ్ తో మహా రాష్ట్రలోని పలు నియోజకవర్గాల్లో విజయతీరాలు చేరవచ్చని అంచనా వేస్తోంది. పవన్ ను ప్రచారానికి ఆహ్వానించడంపై జనసేన శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఇది సార్.. మా బ్రాండ్ అంటున్నాయి.



## బీజేపీని కుక్కతో పోల్చిన
# మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్

(మొదటిపేజీ తరువాయి)

''మిమ్మల్ని కుక్కలు అంటున్న బీజేపీకి అకోలా జిల్లాలోని ఓబీసీలు ఓటేస్తారా?'' అని ప్రశ్నించారు. బీజేపీని ఇప్పుడు కుక్కలా మార్చే సమయం వచ్చిందని పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి బీజేపీని పారదోలే సమయం ఆసన్నమైందన్న నానా పటోలే.. పలు అబద్ధాలతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు దాని స్థానమేంటో చెప్పే సమయం ఆసన్నమైందని చెప్పారు. బీజేపీ నేతలు తమనుతాము దేవుడిగా, విశ్వగురుగా అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఫడ్నవీస్ కూడా తనకు తాను దేవుడినని అనుకుంటున్నారని విమర్శించారు. నానా పటోలే వ్యాఖ్యలపై బీజేపీ నేత, మాజీ ఎంపీ కిరిట్ సోమయ తీవ్రంగా స్పందించారు. ఓటమితో నిరాశ, నిస్పృహల్లో ఉన్న కాంగ్రెస్ నేతలు బీజేపీ వారిని కుక్కలుగా పిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మంత్రి లోకేశ్ కృషితో ఏపీకి
# మరో భారీ పెట్టుబడి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన కృషితో రాష్ట్రంలో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సిద్ధమైంది. గుజరాత్ తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఏపీలో మాత్రమే ఇంత పెద్దఎత్తున పెట్టుబడులకు సిద్ధమైంది. ఏపీలో 500 అధునాతన బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతోంది. అమెరికా పర్యటనకు ముందు ముంబైలో పలువురు పారిశ్రామిక వేత్తలతో లోకేశ్ భేటీ అయ్యారు. ఆ సమయంలో రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీ, రిలయన్స్ క్లీన్ ఎనర్జీకి నేతృత్వం వహిస్తున్న అనంత్ అంబానీని కూడా కలిశారు. గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఎనర్జీ రంగాలకు ఏపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రంలో పెట్టబడులకు సంబంధించి అనంత్ అంబానీ, లోకేశ్ మధ్య అప్పుడే ఓ అవగాహన కుదిరింది. ఇపుడు పూర్తిస్థాయి స్పష్టత వచ్చింది.

### పెట్టుబడులకు స్వర్గధామం

లోకేశ్ కృషితో ఇప్పటికే ఏపీలో సౌర, పవన విద్యుత్ రంగంలో రూ. 40 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు టాటా పవర్ ముందుకు వచ్చింది. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ కోసం ఎటువంటి హడావుడి లేకుండా లోకేశ్ జరుపుతున్న చర్చలపై దేశవ్యాప్తంగా పరిశ్రమ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. స్టీల్ దిగ్గజం ఆదిత్య మిట్టల్‌తో ఒక్క వీడియో కాన్ఫరెన్స్‌తో రూ. 1.4 లక్షల కోట్ల పెట్టుబడిని ఖరారు చేయడం, తాజాగా రిలయన్స్ పెట్టుబడులపై ఏపీ పారిశ్రామక వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రిలయన్స్ పెట్టుబడులతో రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,50,000 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# రామాయణంపై శ్రీలంక ఎయిర్‌లైన్ యాడ్

**శ్రీలంకలోని రామాయణ ఇతిహాసంతో సంబంధం ఉన్న అన్ని ప్రదేశాలకు టూర్ సందర్శకులను తీసుకెళ్లేందుకు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ ప్రత్యేక సర్వీస్**

**'ద రామాయణ ట్రెయిల్స్' పేరిట సర్వీస్ ప్రారంభించిన విమానయాన సంస్థ**

**ఈ సర్వీస్‌ను ప్రమోట్ చేయడానికి ప్రచార చిత్రాన్ని రూపొందించిన ఎయిర్‌లైన్స్**

**యాడ్ చూసి ప్రశంసలు కురిపిస్తున్న నెటిజన్లు**



**మహా, ఢిల్లీ :** పొరుగు దేశం శ్రీలంకకు చెందిన ఓ విమానయాన సంస్థ రామాయణంపై రూపొందించిన ఓ అద్భుతమైన ప్రచార చిత్రం (యాడ్) ఇప్పుడు నెట్టింట బాగా వైరల్ అవుతోంది. శ్రీలంకలోని రామాయణ ఇతిహాసంతో సంబంధం ఉన్న అన్ని ప్రదేశాలకు పర్యాటకులను తీసుకెళ్లేందుకు ఒక సర్వీస్‌ను శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ ఇటీవల ప్రారంభించింది. 'ద రామాయణ ట్రెయిల్స్' పేరిట ప్రారంభించిన ఈ సర్వీస్‌ను ప్రమోట్ చేయడానికి ఎయిర్‌లైన్స్ ఓ మంచి ప్రచార చిత్రాన్ని రూపొందించింది. ఆ యాడ్‌లో ఓ పెద్దావిడ తన మనవడికి రామాయణాన్ని బొమ్మల రూపంలో వివరించడం మనం చూడొచ్చు. ఆ సమయంలో శ్రీలంకలోని రామాయణంతో సంబంధం ఉన్న ప్రాంతాలను చూపించారు. అలాగే రామసేతువును కూడా చూపించడం జరిగింది. కనులవిందుగా 5 నిమిషాల నిడివితో ఈ ప్రచార చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ ప్రస్తుతం ఈ యాడ్ తాలూకు వీడియో నెట్టింట హల్‌చల్ చేస్తోంది. వీడియో చూసిన నెటిజన్లు శ్రీలంక విమానయాన సంస్థపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# గవర్నర్ అనుమతి రాగానే ఈ రేసు స్కాంలో చర్యలు

**ఢిల్లీ, మహా:** గవర్నర్ నుంచి అనుమతి రాగానే ఈ రేస్ స్కాంలో చర్యలు ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఒకప్పుడు బీజేపీని విమర్శించిన కేటీఆర్, ఇప్పుడు ఢిల్లీలో అదే పార్టీ నేతలను కలుస్తున్నారని ఎద్దేవా చేశారు. అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ వచ్చారని ఆయన ఆరోపించారు. 'ఈ రేస్ స్కామ్‌లో తప్పు చేసినవారిని వదలబోం. ఆ స్కామ్‌కు సంబంధించి గవర్నర్ అనుమతి రాగానే చర్యలు ఉంటాయి. తప్పు చేసిన వారిని అరెస్ట్ చేస్తాం. సడెన్‌గా కేటీఆర్ ఢిల్లీ ఎందుకు వచ్చారు?. ఈ రేస్ స్కామ్ నుంచి తప్పుకునేందుకే ఢిల్లీ వచ్చారు. గతంలో బీజేపీని అంతం చేస్తానని కేటీఆర్ అన్నారు. మరి ఇప్పుడు ఆ పార్టీ నేతలను ఎందుకు కలుస్తున్నారు?. మహారాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయొద్దని చెప్పడం బీజేపీకి సహకరించడం కాదా ?' అని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.



**దాడులను ఉపేక్షించం..**

వికారాబాద్ లగచర్ల ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. అధికారులపై దాడిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు. దాడుల వెనక ఎంతటివారు ఉన్నా సరే వదిలేదిలేదన్నారు. దాడులు చేయించినవారిని అరెస్ట్ చేయడం ఖాయమన్నారు.

## విషనాగుల వెనుక ఉన్న
# అనకొండ వైఎస్ జగన్‌ను అరెస్ట్ చేయాలి
## వైఎస్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు

**అమరావతి, మహా:** సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేయించింది తన సోదరుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని.. అతడిని అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఒక సైతాన్ సైన్యంలా మారిందని మండిపడ్డారు. విషనాగులతో పాటు అనకొండను అరెస్టు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తన సోదరుడు వైఎస్ జగన్‌ను షర్మిల అనకొండతో పోల్చి విమర్శలు చేశారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌పై షర్మిల స్పందిస్తూ.. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న సోషల్ మీడియా కార్యకర్తలపై అరెస్ట్ అంశంపై కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై షర్మిల విరుచుకుపడ్డారు. జగన్‌తోపాటు అతడి సోషల్ మీడియా సైన్యంపై మండిపడ్డారు. అంతేకాకుండా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన వైఎస్ జగన్ తీరుపై కూడా ధ్వజమెత్తారు.

# రైతులపై అక్రమ కేసులు పెట్టొద్దు

**లగిచెర్ల అరెస్టులపై ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం**




**మహా, ఢిల్లీ:** రైతులపై అక్రమ కేసులు పెడితే మంచిది కాదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. లగిచెర్ల అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ వేదికగా రైతుల అరెస్ట్‌లపై స్పందించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల మీద కేసులు పెడితే యావత్ తెలంగాణ సమాజం తిరుగుబాటు చేస్తుందని హెచ్చరించారు. ఫార్మా కంపెనీలకు అవసరమైతే వారే భూ సేకరణ చేసుకుంటారు కానీ ప్రభుత్వం మధ్యలో బ్రోకర్ లాగా వ్యవహరించాల్సిన అవసరం లేదని చెప్పారు. రేవంత్‌కు ఓట్లు వేసింది మధ్యవర్తిత్వం చేయడానికి కాదని స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగిచర్ల గ్రామంలో ఫార్మాసిటీ కోసం భూములు సేకరించాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ధ్వజమెత్తారు. దీనిని అక్కడ రైతాంగం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

**ఫార్మా కంపెనీలకు రైతుల భూములు అప్పజెప్పే ప్రయత్నం**

"మా భూములు గుంజుకోకండి, మా ఉపాధి మీద దెబ్బకొట్టకండి అని ఎన్నిసార్లు రైతులు మొరపెట్టుకున్నా వినకుండా ఫార్మా కంపెనీలకు రైతుల భూములను అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ధర్నాలు చేశారు, నిరసనలు తెలిపారు. గ్రామసభలను బహిష్కరించారు. స్వయంగా ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో ధర్నాలు కూడా నిర్వహించారు. అయినప్పటికీ వారి మాట పెడచెవిన పెట్టిన ప్రభుత్వం భూ సేకరణ కోసం సమావేశం ఏర్పాటు చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని అడ్డం పెట్టుకుని కొడంగల్ చుట్టుపక్కల మండలాల్లో ఇంటర్నెట్, కరెంటు బంద్ చేసి వందల మంది పోలీసులు గ్రామాల్లో మోహరించి రైతులను అరెస్టు చేయడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. గతంలో ముచ్చర్లలో ఫార్మసిటీ కోసం రూ.8 లక్షలకు భూములు సేకరించి రూ.1 నుంచి 2 కోట్లకు ఫార్మా కంపెనీలకు గత ప్రభుత్వం అప్పజెప్పే ప్రయత్నం చేస్తే.. ఇదే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది" అని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

## జార్ఖండ్.. తొలివిడత కీలక నియోజకవర్గాలు

**మహా, జార్ఖండ్:** బీజేపీ నుంచి దినేషానంద్ గోస్వామి (బహరాగోరా), బాబూలాల్ సోరెన్ (ఘట్‌శిల), పూర్ణిమా సాహు (జంషెడ్‌పూర్ ఈస్ట్), చంపై సోరెన్ (సరైకేలా), గీతా గోరా (జగన్నాథ్‌పూర్), సుదర్శన్ భగత్ (గుమ్లా), మీనా ముండా (పొట్కా) వంటి అభ్యర్థులు తొలి విడతలో బరిలో నిలిచారు. జార్ఖండ్ ముక్తి మోర్చా నుంచి రామ్‌దాస్ సోరెన్ (ఘట్‌శిల), బైద్యనాథ్ రామ్ (లతెహర్) దీపక్ బారువా (చాయ్‌బాసా), మిథిలేష్ కుమార్ ఠాకూర్ (గర్వా), మహువా మాఝీ (రాంచీ) వంటి హేమాహేమీలు తొలి విడత పోలింగ్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునే వారిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి డాక్టర్ అజొయ్ కుమార్ (జంషెడ్ పూర్ ఈస్ట్), రామేశ్వర్ ఓరమ్ (లోహర్‌దాగా), జేడీయూ అభ్యర్థి సరయూ రాయ్ (జంషెడ్‌పూర్ వెస్ట్) బరిలో ఉన్నారు.

**టీజీపీఎస్సీ కొత్త ఛైర్మన్ నియామకానికి**

## నోటిఫికేషన్ విడుదల

- అప్లికేషన్ ద్వారా నేరుగా ఎంపిక
- డిసెంబర్ 3తో ముగియనున్న మహేందర్ రెడ్డి పదవీకాలం

**హైదరాబాద్, నవంబర్ 12:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఛైర్మన్ పదవికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. టీజీపీఎస్సీకి ప్రస్తుతం మహేందర్‌రెడ్డి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన పదవీకాలం డిసెంబరు 3వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో మరో ఛైర్మన్‌ను నియమించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబర్ 20న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు ఫారం, అర్హతలు, ఇతర వివరాలు www.telangana.gov.in వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు వెల్లడించింది. పూర్తిచేసిన దరఖాస్తులను దరఖాస్తు గడువులోగా prlsecyser gpmgad@telangana.gov.in కు పంపించాలని కోరింది. ప్రభుత్వం నియమించిన స్క్రీనింగ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి, నేరుగా ఎంపిక చేస్తుందని ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

# అధికారులపై దాడి చేస్తే నోరుమెదపరు

**అరెస్టులు చేస్తే ఎలా ఖండిస్తారు**

లగచర్ల దాడిపై సమగ్ర దర్యాప్తు చేయండి

దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

డీజీపీని కోరిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ




**హైదరాబాద్, మహా:** అధికారులపై భౌతికంగా దాడి చేసి గాయపర్చినప్పుడు నోరు మెదపని వారు.. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేస్తే ఖండించడం ఎంత వరకు సరైనదని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేసే ఉద్యోగులపై దాడులు చేస్తే సరైన పద్ధతి కాదన్నారు. వికారాబాద్ జిల్లాలో అధికారులు, ఉద్యోగులపై సోమవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టుగా తెలిపారు.

తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం డీజీపీ జితేందర్‌ను కలిసి లగచర్ల గ్రామంలో అధికారులపై జరిగిన దాడిపై సమగ్ర దర్యాప్తు జరిపించి దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందచేశారు. గ్రామంలో ఫార్మా కంపెనీ విషయమై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, కడా ప్రత్యేకాధికారి, తహశీల్దార్, ఇతర అధికారులపై కొందరు రైతుల ముసుగులో పథకం ప్రకారమే దాడి చేసినట్టుగా కనిపిస్తుందన్నారు. దాడి చేసిన వారిని, దాడి వెనుకాల ఉన్న వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందించారన్నారు. దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తిలేదని.. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టుగా డీజీపీ చెప్పారని జేఏసీ నాయకులు తెలిపారు.

అనంతరం రాష్ట్ర సచివాలయంలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో ఛైర్మన్ లచ్చిరెడ్డి, ఇతర నాయకులు మాట్లాడారు. ప్రజా సేవ చేస్తున్న అధికారులపై దాడులు చేసేలా ఉసికొల్పడం సరైన పద్ధతి కాదన్నారు. జిల్లా కలెక్టర్‌నే గ్రామానికి వచ్చినప్పుడు తమ అభిప్రాయాన్ని రైతులు, గ్రామస్తులు స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉందన్నారు. కానీ అదే కలెక్టర్ పట్ల దురుసుగా ప్రవర్తించడం, మిగతా అధికారులపై భౌతికదాడులకు దిగడం, వాహనాలను ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అధికారులపై భౌతిక దాడులు చేసే సంస్కృతిని ఎవరూ కూడా సహించరన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, ఎస్.రాములు, రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, రాధ, తెలంగాణ నిర్మల, చంద్రశేఖర్‌గౌడ్, రాబర్ట్ బ్రూస్, పుష్పలత, తిరుపతి, విజయ్‌కుమార్, హరీందర్‌సింగ్, తదితరు పాల్గొన్నారు.

## రేవంత్ చేసిన పాపం ప్రజలకు శాపం

- కావద్దని వేములవాడ రాజన్నను వేడుకున్నా
- మాజీ మంత్రి హరీష్ రావు

వేములవాడ, మహా : రేవంత్ రెడ్డి చేసిన పాపం రాష్ట్ర ప్రజలకు శాపం కావద్దని వేములాడ రాజన్నను మొక్కుకున్నా.. జ్ఞానోదయం చేయాలని వేడుకున్నా అంటూ మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గిత్యాల ఎమ్మెల్యే సంజయ్ చేపట్టిన రైతు యాత్రకు వెళ్తున్న హరీష్ఎ రావు వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎంతో భక్తితో ప్రజలు రాజరాజేశ్వర స్వామిని కొలుస్తారు. కోరిన మొక్కులు చెల్లిస్తారన్నారు. పంద్రాగస్టు వరకు రుణమాఫీ చేస్తా అని సిఎం రేవంత్ రెడ్డి రాజన్న మీద ఒట్టు వేసి మాట తప్పాడని ఫైర్ అయ్యారు. పాలకుడే పాపం చేస్తే రాష్ట్రానికి అరిష్టమవుతుంది, ప్రజలకు శాపమవుతుందని వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, పంటలకు మద్దతు ధర రాక, అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. మద్దతు ధర రాక దళారులకు పంట అమ్ముతున్నారని... పౌరసరఫరాల మంత్రిగా గంగుల కమలాకర్ ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి గింజ దాకా కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. వడ్లకు బోనస్ ఇచ్చామని మహారాష్ట్ర ఎన్నికలలో ప్రచారం చేస్తున్నారని హరీష్ రావు ఆగ్రహించారు. రైతుబంధు ఎగ్గొట్టిండు, యాసంగి పంటకు అయినా ఇచ్చేలా చూడు అని దేవుణ్ణి కోరుకున్నా అన్నారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టి మాట తప్పింది రేవంత్ రెడ్డి... భయం లేదు, భక్తి లేదు అన్న అనుమానం వస్తున్నదని ఫైర్ అయ్యారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అన్నారు మాట తప్పారని... రూ. 2 లక్షలకు పైన ఉన్న వాళ్ళు ఎందుకు డబ్బులు కట్టాలని కోరారు.

## జమిలి ఎన్నికలు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం

- మోడీ, షా రాజకీయం లౌకిక వ్యవస్థకు విరుద్ధం
- సిపిఐ నేత నారాయణ
- ఆర్థిక పరిస్థితిపైన శ్వేతపత్రం విడుదల చేయండి
- కూనంనేని సాంబశివరావు




**హైదరాబాద్, మహా :** మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే, ప్రధాని మోదీ జమిలి ఎన్నికలకు సిద్ధమవుతారని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. జమిలి ఎన్నికలు ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమని, జమిలి ఎన్నికలు జరిగితే అనార్థాలకు దారితీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగించే రీతిలో మోదీ, అమిత్ షా రాజకీయాలు చేస్తున్నారని, వారు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరంగా మారారని దుయ్యబట్టారు. అమిత్ షా కేంద్రమంత్రి అయిన తర్వాతనే నేర పూరిత రాజకీయాలకు ప్రత్యేక్షంగా ఆజ్యాం పోస్తున్నారన్నారు. కులగణన మంచి కార్యక్రమమని, అనవసరమైన ప్రశ్నలతో దీనిని వివాదస్పదం చేసుకోద్దని నారాయణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్ మగ్దూం భవనలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి నారాయణ మాట్లాడుతూ కులగణనలోని ప్రశ్నలు సరళతరంగా ఉండాలని, దీనికి సంబంధించి ఒక యాప్ ఏర్పాటు చేస్తే, అందులో ప్రజలు వారి వివరాలు పొందపరుస్తారన్నారు. ఆర్థిక, రాజకీయ, సమానత్వం కలిగేలా కులగణన ఉండాలని సూచించారు. కులాలు, మతాలపైన అభిమానం ఉండాలని, కానీ, కుల, మతతత్వం ఉండకూడదని చెప్పారు.

వికారాబాద్ కలెక్టర్ దాడి చేయడం సరైంది కాదని, అదే సమయంలో రైతుల బాధను, వారి ఆవేదనను కూడా ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు. దాడి చేశారనే నెపంతో ఒక రాజకీయ పార్టీ ముద్ర వేసి చర్యలు తీసుకోవద్దన్నారు. సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఇంటికి ప్రధాని మోదీ వెళ్లడం, ఆయనను ప్రధాన న్యాయమూర్తి ఆహ్వానించడం రెండూ తప్పేనని, రాజకీయాల్లో ఇది దుష్ట సంప్రదాయమని, ఇటువంటివి న్యాయ వ్యవస్థకు కలంకం తీసుకొస్తాయని చెప్పారు. న్యాయవ్యవస్థ లక్ష్మణ రేఖను దాటకూడదని సూచించారు. దేశంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలను మోదీ తన గుప్పిట్లో పెట్టుకున్నారని, ఆంధ్రప్రదేశ్ టిడిపి, వైసిపిని తమ గుప్పిట్లో పెట్టుకున్నారని విమర్శించారు. ఎపి సిఎం చంద్రబాబుతో మోదీది విషకౌగిలి అని అన్నారు. ఈ నెల 17న కొల్లేరు సరస్సును సందర్శించనన్నట్టు నారాయణ వివరించారు.

# విజయ్‌కి లుకౌట్ నోటీసులు

**జన్వాడ పార్టీ కేసు కొత్త మలుపు.. దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు**

**మహా, హైదరాబాద్:** జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కొకైన్ డ్రగ్ పాజిటివ్ రావటంతో మోకిలా పీఎస్‌లో మద్దూరి విజయ్‌పై కేసు నమోదు అయిన విషయం విదితమే. దీంతో ఈ కేసులో నిందితుడిగా విజయ్ మద్దూరికి లుకౌట్ నోటీసులు జారీ చేశారు పోలీసులు. విదేశాలకు పారిపోయే అవకాశముందన్న సమాచారంతో విజయ్‌కు పోలీసులు లుక్ అవుట్ నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది.

**డ్రగ్స్‌పైనే ప్రధాన ఫోకస్..**

ఈ కేసులో విచారణ జరుగుతుండడంతో డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చేయన్న దానిపై అధికారులు ఫోకస్ చేశారు. ఇంతకీ డ్రగ్స్ ఎక్కడ తీసుకున్నాడు? ఆయన ఫోన్ విషయంలో పోలీసులను తప్పుదోవ పట్టించాడట. పట్టుబడిన రోజు తన ఫోన్ కాకుండా, మరో మహిళ ఫోన్‌ను పోలీసులకు అందజేశాడు. దీనిపై మరో కేసు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

**పోలీసులకు కీలక సమాచారం..**

విజయ్ ఎవరి ద్వారా డ్రగ్స్ తీసుకున్నాడనే దానిపై ఆరా తీస్తున్నారు. అరెస్ట్ కాకుండా ముందగా న్యాయస్థానాన్ని సంప్రదించాడు. విచారణకు సహకరించకుండా మరో దేశానికి వెళ్తాడనే సమాచారం పోలీసులకు వచ్చింది. విదేశీ మద్యం కొనుగోలు, డ్రగ్స్‌పై ఎవరి దగ్గర తీసుకున్నాడనేది తేలితే ఈ కేసు ముగింపు రావడం ఖాయమని అంటున్నారు.

# ఈనెల 14 నుంచి ప్రజా విజయోత్సవాలు ప్రారంభం

**ఎల్ బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభం.. 14 వేల మంది పాఠశాల విద్యార్థులచే సమావేశం**



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తి అయిన నేపథ్యంలో నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల ఈ నెల 14 వ తేదీన ఎల్.బీ స్టేడియంలో దాదాపు 14 వేల మంది పాఠశాల విద్యార్థులతో విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేకంగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో ఈ సంవత్సర కాలంలో విద్యార్థుల కోసం చేసిన గణనీయమైన మార్పులు, డైట్ చార్జీల పెంపు, రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇంటి గ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలకు ఉచిత కరెంట్, తదితర ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టడం జరిగిందని గుర్తుచేశారు. ఎల్.బీ స్టేడియం లో 14 వ తేదీన నిర్వహించే కార్యక్రమ ఏర్పాట్లపై నేడు సాయంత్రం సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు శ్రీధర్, బుర్రా వెంకటేశం, కార్యదర్శి శరత్ తదితర అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ పాలన ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఈనెల 14 తేదీ నుండి డిసెంబర్ 9 వ తేదీ వరకు 26 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు.

ఈ ఉత్సవాలలో మొదటి రోజైన 14 న ప్రభుత్వ, గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థుల సమావేశంలో గౌరవ ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే మోడల్ అసెంబ్లీ, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, ఈ సంవత్సర కాలంలో విద్యా శాఖలో వచ్చిన గణనీయ మార్పులు, అభివృద్ధిపై ఏ.వీ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. శాఖ పై ప్రత్యేకంగా రూపొందించిన సావనీర్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రతీ జిల్లా నుండి విద్యార్థులు హాజరవుతారని అన్నారు. ఎల్.బీ స్టేడియంలో మధ్యాహ్నం నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎండా, వానలకు విద్యార్థులు ఇబ్బంది పడకుండ షామియానాలు, నిరంతర విద్యుత్ సరఫరా, హాజరయ్యే విద్యార్థులకు కనీస సౌకర్యాల కల్పన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదిక నిర్మాణం తదితర ఏర్పాట్లను చేపట్టాలని పేర్కొన్నారు.





ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక దీపోత్సవం



# కాంగ్రెస్‌తోనే వరంగల్ అభివృద్ధి...


**కూరగాయల మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతాం... మంత్రి కొండా సురేఖ..**

**వరంగల్, మహా ;** వరంగల్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ, సంబంధిత శాఖల అధికారు లతో కలసి వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లను పరిశీలించి, రైతులు, వ్యాపారులు, విక్రయదారులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తాను శాసన సభ్యులుగా ఉన్నప్పుడు నిరుపేదలకు, అర్హులకు ఆదుకోవాలనే ఉద్దేశంతో మోడల్ మార్కెట్‌కు శంకుస్థాపన చేసి పనులు కూడా ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు. గత రాజకీయ నాయకుల ప్రాబల్యంతో అనర్హులు బినామీ పేర్ల మీద దుకాణాలు కేటాయించుకొని విక్రయదారుల నుండి డబ్బులు వసూలు చేసుకుంటూ దందాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దుకాణాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, అర్హులకు అన్యాయం జరిగిందని, ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి విచారణ నిర్వహించి అనర్హులను ఖచ్చితంగా తొలగించి లైసెన్స్ ఉన్న వారిని, నిజమైన అర్హులకు మాత్రమే పారదర్శకంగా దుకాణాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని కూరగాయల మార్కెట్ను మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దుటకు గాను ప్రత్యేక కన్సల్టెన్సీ ద్వారా డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించాలని, అందులో పార్కింగ్, వర్మీ కంపోస్ట్, సోలార్ ఎనర్జీ, అంతర్గత రహదారులు, డ్రైనేజ్, పార్కింగ్, వాహనాల రాకపోకలకు వేర్వేరు మార్గాలు ఉండేలా చూడాలన్నారు. వర్షాకాలంలో కొనుగోలుదారులు తడవకుండా ఇబ్బందులు కలగకుండా పెద్ద షెడ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**దుకాణ అద్దెలు తగ్గించాలని మంత్రికి వినతి----**

దుకాణాల అద్దెలు తగ్గించాలని దుకాణా దారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావును చరవాణిలో సంప్రదించి అద్దెలు తగ్గించాలని కోరగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రతిపాదనలు పంపాల్సిందిగా మంత్రి సురేఖను కోరారు. ప్రస్తుతం నిర్మాణం కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ లో కూరగాయలు. పూలు, పండ్ల మార్కెట్ కొరకు వినియోగించు కుంటామని, నాన్ వెజ్ మార్కెట్ కొరకు సమీపంలోని స్థలంలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పురాతన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మార్కెట్లో ఉన్న క్లాక్ టవర్, కార్యాలయ భవనాన్ని తొలగించడం జరగదని స్పష్టం చేశారు. మార్కెట్లో నిర్మిస్తున్న కొత్త భవనాన్ని ఫంక్షన్ హాల్‌గా వినియోగించు కోవాలన్నారు. మర్రిచెట్టు వద్ద ఉన్న స్థలంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తామని, విఘ్నేశ్వరుడి, మైసమ్మ తల్లి దేవాలయాలు ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించి నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కొనుగోలుదారుల వాహనాలను మార్కెట్లోకి అనుమతించకూడదన్నారు. అవుట్సోర్సింగ్ ద్వారా మార్కెట్ లో పారిశుద్ధ్యకార్మికులను, వాచ్ మెన్ లను నియమించుటకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మార్కెట్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ వెండింగ్ మిషన్ ని ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

**జార్ఖండ్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి జార్ఖండ్‌లో. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ 41. ప్రస్తుతం ఇక్కడ ప్రతిపక్షాల ఉమ్మడి కూటమి ఇండియా అధికారంలో ఉంది. జార్ఖండ్ ముక్తి మోర్చా-కాంగ్రెస్-వామపక్షాల ప్రభుత్వానికి ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నాయకత్వాన్ని వహిస్తోన్నారు. ఇక్కడ ఆదివాసీలే గేమ్ ఛేంజర్. రాష్ట్రంలోని గిరిజనేతర ఓట్లను దూరం చేసుకోకుండా రెండు కూటములలో ఎస్టీ ఓట్లలో గణనీయమైన భాగాన్ని ఎవరు పొందుతారో వారే విజేత కానున్నారు. 2000లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి జార్ఖండ్ ఐదవ అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీ కూడా సొంతంగా మెజారిటీని సాధించలేకపోయింది. నవంబర్ 13, 20 తేదీల్లో రెండు రౌండ్లలో జరగనున్న ఎన్నికల్లో జార్ఖండ్ ముక్తి మోర్చా నేతృత్వంలోని ఇండియా కూటమిని ఓడించేందుకు బీజేపీ రాష్ట్ర గిరిజన ఓటర్లను తమవైపు తిప్పకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. మహారాష్ట్ర ఫలితాలతో పాటు నవంబర్ 23న జార్ఖండ్ ఫలితం ప్రకటించనున్నారు. 2019 జార్ఖండ్ ఎన్నికలలో, జెఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమి 81 సీట్లలో 47 గెలుచుకుంది. జెఎంఎం 30 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. పార్టీల మధ్య అత్యధిక ఓట్లు సాధించినా బీజేపీ కేవలం 25 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.**



# గిరిజనులే గేమ్ ఛేంజర్

## జార్ఖండ్ ఎన్నికలు - విశ్లేషణ

తొలివిడత రెడీ

### ప్రతిష్టాత్మకం

ఈ ఎన్నికలను భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ సారథ్యంలోని ఎన్డీఏ, ఇండియా కూటమి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి . అధికారాన్ని నిలబెట్టుకోవడానికి జేఎంఎంకాంగ్రెస్ వామపక్షాలు ఈ సారి అధికారంలోకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరాలని ఎన్డీఏ ప్రయత్నాలు సాగిస్తోన్నాయి. మొత్తంగా 2.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో 1.31 కోట్ల మంది పురుషులు, 1.29 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా 11.84 లక్షల మంది తొలిసారిగా ఓటు వేయనున్నారు. వీరిలో యువ ఓటర్ల సంఖ్య 66.84 లక్షలు. తొలి దశలో 43 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగనుంది. జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ సహా మొత్తం 683 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటోన్నారు. వీరిలో 73 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. తొలి విడతలో 15, 344 మంది పోలింగ్ స్టేషన్లను ఈసీ ఏర్పాటు చేసింది.

### బీజేపీకి నష్టమిలా

జార్ఖండ్ చాలా కాలంగా బిజెపికి బలమైన కోటగా ఉంది. పార్టీ ఉనికిలో ఉన్న 24 సంవత్సరాలలో 13 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించింది. బీజేపీ మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ మాత్రమే 2014 నుంచి 2019 వరకు పూర్తి కాలం కొనసాగారు. కానీ ఆయన దానిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. దాస్‌కు మద్దతు ఇచ్చిన బీజేపీ కేంద్ర నాయకత్వానికి 2019 అసెంబ్లీ ఓటమి జీర్ణించుకోవడం కష్టం. అతను తన సొంత జంషెడ్‌పూర్ ఈస్ట్ సీటును కూడా కోల్పోయాడు. ఇది నిర్ణయాత్మక ఓటమి, ఇది అధికార వ్యతిరేకత, తప్పుడు నిర్ణయాలు మరియు దుష్పరిపాలనకు కారణమైంది. 20162017లో, రఘుబర్ దాస్ మంత్రిత్వ శాఖ చోటానాగ్‌పూర్ అద్దె చట్టం, 1908 మరియు సంతాల్ పరగణ కౌలు చట్టం, 1949లను సవరించాలని కోరింది. ఈ రెండు చట్టాలు గిరిజనుల వారి భూమిపై హక్కుల రక్షణగా రూపొందించబడ్డాయి. ప్రతిపాదిత సవరణలు గిరిజనుల భూమిని పారిశ్రామిక , 'అభివృద్ధి' ప్రయోజనాల కోసం బదిలీ చేయవచ్చు. పాతల్‌గడి ఉద్యమం ద్వారా గిరిజనులు సవరణలను తీవ్రంగా వ్యతిరేకించారు. దాస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఆగస్టు 2017లో రెండు చట్టాలను సవరించే బిల్లులను ఉపసంహరించుకుంది. రఘుబర్ దాస్ కూడా ఏకపక్షంగా వ్యవహరించారు. ఇది కేవలం బ్యూరోక్రాట్‌లను మాత్రమే కాకుండా తన సొంత పార్టీ నాయకులను కలవరపరిచింది. దీంతో బలమైన గిరిజనులు బిజెపికి దూరమయ్యారు. 2019లో రాష్ట్రంలోని 28 ఎస్టీ సీట్లలో బీజేపీ కేవలం రెండింటిని మాత్రమే గెలుచుకోగలిగింది. బాబూలాల్ మరాండీ నేతృత్వంలోని జార్ఖండ్ వికాస్ మోర్చా (ప్రజాతాంత్రిక్) తర్వాత బీజేపీలో విలీనమై ఒక సీటును గెలుచుకుంది.

"ప్రభుత్వం తమ భూమిని లాక్కొని బయటి వ్యక్తులకు, ప్రధానంగా వ్యాపార వర్గాల వారికి విక్రయించడానికి ప్రయత్నిస్తోందని భావించిన గిరిజనులు బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఇది గిరిజనుల మనోభావాలను రెచ్చగొట్టింది" అని రాంచీకి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ప్రదీప్ సింగ్ చెప్పారు. గిరిజనుల ఓటు యొక్క ప్రాముఖ్యతను గ్రహించి, 2023లో బిజెపి తన జార్ఖండ్ ముఖ్యమంత్రిగా మాజీ ముఖ్యమంత్రి బాబులాల్ మరాండీని నియమించింది

### జెఎంఎం వ్యూహాలు

జెఎంఎం కూటమి 2019లో 25 గిరిజన ప్రాంతంలోని సీట్లను గెలిచింది. 2019లో బీజేపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయి, మొత్తం 14 ఎస్టీ స్థానాలను కోల్పోయిన కోల్హాన్ ప్రాంతంలో, ఆ పార్టీ తరుపున మ్యాజిక్ చేయడానికి ముగ్గురు మాజీ గిరిజన ముఖ్యమంత్రులు చంపై సోరెన్, అర్జున్ ముండా , మధు కోడాపై ఆధారపడుతోంది. ఆగస్టులో జేఎంఎంను వీడి బీజేపీలో చేరిన చంపై సోరెన్, ఆయన కుమారుడు బాబూలాల్ సరైకేలా, ఘట్ శిల నుంచి పోటీ చేస్తున్నారు. 2006లో అర్జున్ ముండా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టి ముఖ్యమంత్రి అయిన మధు కోడా ఇప్పుడు బీజేపీ శిబిరంలో ఉన్న వ్యక్తితో పాటు ఒకప్పుడు తన పదవిని వదులుకున్నాడు. ఆయన భార్య గీత, ముండా భార్య మీరా జగన్నాథ్‌పూర్, పొట్కా నుంచి పోటీ చేయడంతో కొల్హాన్‌లో బీజేపీకి మంచి అవకాశాలున్నాయని భావిస్తున్నారు. అయితే "చంపాయ్ సోరెన్ రాజకీయాలు సంతాల్ ప్రాంతానికి పరిమితం చేయబడ్డాయి మరియు అతను శిబూ సోరెన్ అనుచరుడు. అతను రెండు సీట్లకు మించి ప్రభావితం చేయలేడు" అని విశ్లేషకుల అభిప్రాయం.

### మహిళా ఓట్లకు గాలం

జెఎంఎం , ఎన్డీఏ కూటములు మహిళా ఓటర్ల ప్రాముఖ్యతను గ్రహించాయి. మొత్తం 81 అసెంబ్లీ స్థానాల్లో 32 స్థానాల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువ. 28 రిజర్వ్‌డ్ సీట్లలో ఈ ట్రెండ్ మరింత ఎక్కువగా కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, మహిళా ఓటర్లకు అత్యంత ఆకర్షణీయమైన ఆఫర్లను అందించడానికి బిజెపి , జెఎంఎం రెండూ తీవ్రంగా పోటీ పడ్డాయి. రాష్ట్రంలోని ఎస్టీయేతర ఓట్లను దూరం చేయకుండా రెండు కూటములు ఎస్టీ ఓట్లలో గణనీయమైన భాగాన్ని ఎలా సమీకరించుకుంటాయనేది వారి గెలుపుకు కీలకం.

**అసెంబ్లీ స్థానాలు**
**81**

**మేజిక్ ఫిగర్**
**41**

**తొలివిడత ఎన్నికలు**
**43**

**మొత్తం ఓటర్లు**
**2.6 కోట్లు**

- మహా డెస్క్

### ఆదివాసీల ఓట్ల కోసమే కీలక పోరు

2011 జనాభా లెక్కల ప్రకారం, జార్ఖండ్ జనాభాలో దాదాపు 26 శాతం మంది గిరిజనులు ఉన్నారు, మొత్తం అసెంబ్లీ బలం 81లో 28 రిజర్వ్‌డ్ షెడ్యూల్డ్ తెగల సీట్లు ఉన్నాయి. జార్ఖండ్‌లోని ఆదివాసీల ప్రాబల్యం ఉన్న దక్షిణ చోటానాగ్‌పూర్ ప్రాంతంలో రాంచీ, ఖుంటి, గుమ్లా, సిమ్‌డేగా, లోహర్‌దగా అనే ఐదు జిల్లాల్లో 15 సీట్లు ఉన్నాయి - వీటిలో 11 ఎస్టీలకు రిజర్వు చేయబడ్డాయి.



# కృత్రిమ వర్షాలు ఎలా కురుస్తాయి?

## ప్రకృతిని ఎదురించి మనిషి చేసే ప్రయోగాలు మంచివేనా?

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్! ఏడు రాజ్యాల కూటమి. పేరుకే ఎడారి. వర్షం లేని లోటును కనక వర్షం తీరుస్తున్నది అక్కడ. ఇసుకతిన్నెల రంగును మరిపించే బంగారం మురిపిస్తున్నది. లోకం అంతా తల తిప్పుకొని చూసేలా, అక్కడ స్థిరపడితే చాలు అని వలసజీవులు అనుకునేలా సంపదను సృష్టిస్తున్నది. అరబ్ ఎమిరేట్స్‌లో వాతావరణం చాలా పొడిగా ఉంటుంది. అయితే వెర్రెక్కించే ఎండ, లేదా వణికించే చలి. ఈ రెండిటి మధ్యా వర్షపు జాడ కష్టమే! అక్కడి పర్వతప్రాంతాలలో కాస్త వర్షపాతం నమోదవుతుందేమో కానీ, ఇతర తీర ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు అటూ ఇటూగానే ఉంటుంది.

తెలంగాణ సగటు వర్షపాతం 906 మిల్లీమీటర్లతో పోలిస్తే.. ఇదెంత తక్కువో అర్థమవుతుంది. సాగు, తాగునీటి వనరులు అంతంత మాత్రమే. వందల అడుగుల కిందకి అడుగంటిన భూగర్భ జలాలు, సముద్రపు నీటిలోని ఉప్పదనాన్ని తొలగించిన నీరు మాత్రమే ఆధారం. అందుకే కృత్రిమ వర్షాలను కురిపించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతుంటాయి. అందుకోసం ప్రత్యేకమైన శాఖ కూడా ఉంది. కానీ మొన్న కురిసిన భారీ వర్షాలతో... అక్కడి వాతావరణం గురించి, కృత్రిమ వర్షాల యత్నాల గురించి కొత్త వాదనలు, చర్చలు మొదలయ్యాయి!

15 ఏప్రిల్ 2024.. సాయంత్రం. అప్పటిదాకా ఉక్కపోతగా ఉన్న అల్ ఐన్ నగరంలో ఒక్కసారిగా గాలి మొదలైంది. నీలాకాశం కాస్తా ధూళితో పసుపురంగు పులుముకుంది. చినుకులు మొదలయ్యాయి. చినుకు... చినుకు వర్షం అయ్యింది. రాత్రంతా ఎడతెరిపి లేకుండా కురిసిన ఆ వర్షం వరదలా ముంచెత్తింది. ఏకంగా 255 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అరబ్ ఎమిరేట్స్‌లో చాలా చోట్ల ఇదే పరిస్థితి. ఏడాది మొత్తం కురిసే వర్షపాతం... ఒక్కరాత్రిలో నమోదైంది. 75 ఏండ్ల రికార్డులు బద్దలయ్యాయి. ఓడలు బండ్లు... బండ్లు ఓడలు అవుతాయి అనే మాటను అక్కడి నీటిలో తేలుతున్న కార్లు గుర్తుచేశాయి. ఈ ప్రళయం ముందు ఏ సౌకర్యమూ నిలబడలేకపోయింది. ఏ అడ్డుగోడా ఆపలేకపోయింది. జీవితం ఒక్కసారిగా స్తంభించిపోయింది. విమానాలు నేల మీదే తచ్చాడాయి. ఈ వర్షపు వార్తలు, కలవరాల మధ్య... ఓ అనుమానం స్పష్టంగా వినిపించింది. ఈ కల్లోలానికి కారణం కృత్రిమ వర్షమేనా?

**ఏమిటీ కృత్రిమ వర్షం!**

ఆకాశంలో కనిపించే ప్రతి నల్లమబ్బూ... కురవదు. ఊరించి వెళ్లేవే ఎక్కువ. మబ్బులలో ఉండే వర్షపు చుక్కలు తగినంత దట్టంగా లేకపోతే, అవి తేలిపోతాయి. మబ్బు భారమైనప్పుడే, అందులోని నీటి బిందువులు లేదా మంచుగడ్డలు నేల మీదకు జారతాయి. మబ్బులలో సాంద్రతను పెంచాలి అంటే... దూరదూరంగా ఉన్న నీటి బిందువులు దగ్గర కావాలి లేదా అవి ఘనీభవించి మంచుగా మారాలి. ఓ 130 ఏండ్ల క్రితమే... మబ్బులను ఇలా ఏమార్చి, వర్షం కురిపించే ఆలోచనలు మొదలయ్యాయి. మబ్బుల్లోకి మట్టి, ఉప్పు, కార్బన్ డయాక్సైడ్... ఆఖరికి టాల్కం పౌడర్ సహా రకరకాల పదార్థాలు చల్లి వాటిని కురిపించడంలో విఫలమయ్యారు.



### దుబాయ్‌లో అయితే!

గల్ఫ్ తీరంలో కృత్రిమ వర్షాల మీద ఎక్కువ శ్రద్ధ పెట్టేది అరబ్ ఎమిరేట్సే! అధిక జనాభా అవసరాలు తీర్చలేని వర్షపాతం... ఆ కాస్త వర్షం కూడా ఎడారిలో ఇంకిపోవడమే ఇందుకు కారణం! 2010 నుంచే ఇక్కడ కృత్రిమ వర్షాలను కురిపిస్తున్నారు. ఈ రంగంలో పరిశోధనలు జరిగేందుకు, కొత్త పద్ధతులు కనుగొనేందుకు UAEREP అనే ప్రత్యేక ప్రాజెక్టును కూడా ఆ దేశం మొదలుపెట్టింది. ఇందుకోసం కోట్ల రూపాయలను ధారాళంగా ఖర్చుచేస్తున్నది కూడా! కొన్నేండ్ల నుంచి డ్రోన్ల సాయంతో కూడా మేఘాలకు ఎలక్ట్రిక్ షాక్స్ ఇప్పిస్తూ వర్షం కురిపించే ప్రయత్నం జరుగుతున్నది. దుబాయ్, అబుదాబి లాంటి ప్రదేశాల్లో విజయవంతంగా వర్షాలు కురిపించిన నేపథ్యం తనకు ఉంది. అయితే ఈ ప్రయాణంలో కొన్ని అపవాదులూ లేకపోలేదు. 2019లో వచ్చిన వరదలకు కూడా క్లౌడ్ సీడింగే కారణం అన్న ఆరోపణ ఉంది. ఈ ఏడాది వచ్చిన వరదల వెనుక కూడా ఇదే మాట వినిపించింది. అయితే ఈ వాదనను కొట్టిపారేస్తున్నారు అరబ్ నిపుణులు. వాళ్లు చెబుతున్న మాటల ప్రకారం 'మేము చేసే ప్రయత్నాల వల్ల వర్షపాతం 10 శాతం పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో మహా అయితే 30 శాతం పెరుగుతుంది. అంతేకానీ కృత్రిమ వర్ష ప్రయత్నాలతో వరదలు రావడం అసాధ్యం! పైగా భారీ మబ్బుల జోలికి మేము వెళ్లం.

### ఇదీ ప్రక్రియ!

నల్ల మబ్బుల్లోని నీటి బిందువులను ఘనీభవింపచేయడానికి సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్, ప్రొపేన్, డ్రై ఐస్ లాంటి పదార్థాలను వాడతారు. ఉప్పులాంటి కొన్ని పదార్థాలు చుట్టూ ఉన్న తేమను పీల్చుకునే శక్తిని కలిగి ఉంటాయి. వీటిని హైగ్రోస్కోపిక్ పదార్థాలు అంటారు. మబ్బుల్లోని బిందువులు దగ్గరకు వచ్చేందుకు ఇవి సాయపడతాయి. మేఘాలు ఎంత దట్టంగా ఉన్నాయి, ఎంత ఎత్తులో ఉన్నాయి, ఏ దిశగా ప్రయాణిస్తున్నాయి, వాటిలో నీటి శాతం ఎంత... లాంటి రకరకాల అంచనాల తర్వాత వాటిని నీరుగార్చే (క్లౌడ్ సీడింగ్) ప్రయత్నం మొదలవుతుంది. అందుకు అనుకూలమైన రసాయనాన్ని విమానాల ద్వారా వెదజల్లుతారు లేదా కింద నుంచి మేఘాల దిశగా వాటిని విసురుతారు. కృత్రిమ వర్షం కోసం ఇలా రసాయనాల వాడకంతోపాటు మబ్బులు వర్షాన్ని కురిపించేలా, వాటికి విద్యుద్ఘాతాన్ని కలిగించడం... లేజర్ కిరణాల ద్వారా వాటిని వర్షింపచేయడం లాంటి సాంకేతికతలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

### రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

ANN తెలుగు
# మహా పత్రిక
05
బుధవారం, హైదరాబాద్ | 13-11-2024 | జిల్లాల వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

## ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

- నెల రోజులలో సమస్యలు, కేసులు పరిష్కరించండి
- విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి
- సివిల్ రైట్స్ కార్యక్రమం పకడ్బందీగా జరగాలి
- ల్యాండ్, అట్రాసిటీ సమస్యలపై సమీక్ష
- కలెక్టర్ కు అభినందనలు తెలిపిన చైర్మన్ బక్కి వెంకటయ్య




**ఖమ్మం, నవంబర్ 12, మహా:** ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూలు కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ల్యాండ్, అట్రాసిటీ సమస్యలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూలు కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, కమీషన్ గౌరవ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రీ, పోస్టు మెట్రిక్ రెసిడెన్షియల్ హాస్టల్స్, ఇందిరా మహిళా శక్తి, కార్పొరేషన్ రుణాలు దళిత బంధు, పెండింగ్ భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల నమోదు వంటి వివిధ అంశాలను అధికారులు కమిషన్ కు వివరించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉన్న వివిధ రకాల సమస్యలను సంబంధిత వర్గాల ప్రజలు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ పెండింగ్ ఎస్సీ, ఎస్టీ రెవెన్యూ భూ సంబంధిత కేసుల పరిష్కారానికి అవసరమైన నివేదికలు తెప్పించుకోవాలని, మొత్తం పెండింగ్ దరఖాస్తులను నెల రోజుల వ్యవధిలోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలలో అధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు వెళ్తారని, ఇక్కడ అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. ఎం.జి.ఎన్.ఆర్.జి.ఎస్. పథకం క్రింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అంగన్వాడీ కేంద్రాలకు 5 నుంచి 10 కోట్ల వరకు నిధులు పెట్టి కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక తయారు చేస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో స్థానిక ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ అద్దె భవనాల్లో ఉన్న 300 అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేయించుకోవాలని, డిసెంబర్ నెలలో ప్రారంభించి మార్చి నాటికి పనులు పూర్తి చేసే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం దిశగా ఆలోచించి కిచెన్ గార్డెన్ ల ఏర్పాటు, మధ్యాహ్న భోజన నాణ్యత పెంపు, ఆంగ్ల పరిజ్ఞానం పెంపుకు చర్యలు వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్న కలెక్టర్ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో అమలు చేస్తున్న కిచెన్ గార్డెన్, జిల్లా అధికారుల పాఠశాలల తనిఖీ వంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద జిల్లాలో పోలీస్ శాఖ తరపున క్రియాశీలమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కమిషన్ తరపు నుంచి వచ్చిన పిటీషన్లను సంపూర్ణంగా విచారించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, అదనపు డీసీపీ నరేష్ కుమార్, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, జిల్లా అధికారులు, ఏసీపీలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంలో సత్వర చర్యలు చేపట్టాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 12, మహా:** ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంలో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, నెల రోజుల్లో పరిష్కరించి వాటి నివేదిక అందజేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరంలో భూ, అట్రాసిటీ సమస్యలపై రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ, ఇతర శాఖల అధికారులతో ఆయన.. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు తో కలసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి పురోగతి వివరాలను డీఎస్పీలు రెహమాన్, సతీష్, కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పలు భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల గురించిన వివరాలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు చైర్మన్ ను కోరారు. ఈ సందర్భంగా భూ వివాదాలకు సంబంధించిన కేసులు, అట్రాసిటీ కేసుల పరిష్కారం ఎన్ని రోజుల్లో అవుతుందని కలెక్టర్ మరియు పోలీస్ అధికారులను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ ,ఎస్టీ కేసుల్లో ఎంతమంది బాధితులకు పరిహారం అందిందని వివరాలను జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పంచాయితీ, విద్యాశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ, వైద్య శాఖ ల పరిధిలో ఎంతమంది ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు..?,ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కస్తూరిబా మరియు అంగన్వాడీ కేంద్రాలు ఎన్ని ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయి? ఎన్ని అద్దె భవనాల్లో ఉన్నాయి? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎన్ని పాఠశాలలలో పనులు చేపట్టారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు రాంబాబు నాయక్, నారాయణ, ప్రవీణ్, ఆర్డీవోలు మధు, దామోదర్ రావు, షెడ్యూల్ తెగల అభివృద్ధి శాఖ అధికారి అనసూయ, జిల్లా అధికారులు, తహశీల్దారులు, ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు ఏనుమూరి లక్ష్మీబాయి, రవికుమార్, లావుడియా సామ్య, లకావత్ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు తదితరు పాల్గొన్నారు.

## పత్తికొనుగోలు వేగవంతం చేయాలి

### సీసీఐ నిబంధనలను సడలించాలి

### అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం డిమాండ్



**ఖమ్మం అర్బన్, నవంబర్ 12, మహా:** జిల్లాలో జిన్నింగ్ మిల్లుల దగ్గర సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కొనుగోలు సక్రమంగా చేయడంలేదని, సీసీఐ నిబంధనలను సడలించి పత్తిని కొనుగోలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం జిల్లా ప్రతినిధి బృందం జిన్నింగ్ మిల్లులను సందర్శించి సీసీఐ కొనుగోలను కేంద్రాలను పరిశీలించింది. ఈ సందర్భంగా రైతు సంఘం పరిశీలనలో సీసీఐ నామమాత్రంగా కొనుగోలు చేయటం వల్ల కొనుగోలు సక్రమంగా జరగటం లేదని, దీనికి సీసీఐ నిబంధనలు అడ్డంకుగా ఉన్నాయన్నారు. కౌలు రైతుల పత్తిని కొనుగోలు చేయటం లేదని, దానివలన అసలు సాగు చేసిన రైతులు నష్టపోతున్నారని సర్టిఫికెట్ తో కౌలు రైతుల పత్తిని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీసీఐ బయ్యర్ అవినాష్ గారితో చర్చించగా నిబంధన ప్రకారం కొనుగోలు చేస్తున్నామన్నారు. నిబంధనల తొలగింపు విషయమై పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కమ్మకొంటి నాగేశ్వరరావు, కోశాధికారి కే లోతు లక్ష్మణ్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు మారుతి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


## మహిళకు ఆర్థిక సాయం



**ఇల్లందు, నవంబర్ 12, మహా:** మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో నివాసముంటున్న బానోత్ ఝాన్సీకి కడుపులో కంతి వల్ల మంగళవారం ఖమ్మం సాయి మారుతీ వైద్యశాలలో ఆపరేషన్ జరుగగా 7వ వార్డు మాజీ కౌన్సిలర్ పర్రె స్వర్ణలతశ్రీనివాస్ దంపతులు వైద్యశాలకు వెళ్లి ఆమెను పరామర్శించారు. అనంతరం ఆమెకు రూ. 3 వేల ఆర్థిక సాయంతోపాటు పండ్లు, పాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన బానోత్ ఝాన్సీకి కడుపులో కంతి ఉండడం వల్ల 4 నెలలుగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కుటుంబసభ్యులు ఝాన్సీని హాస్పిటల్ కు తరలించి ఆపరేషన్ చేయించడం జరిగిందన్నారు. ఝాన్సీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెకు తోచిన సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు చుట్టకుల ఉషా, వెంకటేశ్వర్లు, సాయి, హాని, క్రాంతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో పబ్లిక్ టాయిలెట్స్ ఎక్కడ..?



**అశ్వారావుపేట, నవంబర్ 12, మహా:** అశ్వారావుపేట పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడం స్థానికులకే కాదు, సుదూర ప్రాంతాల నుంచి పనిమీద వచ్చేవారికి ఇబ్బందిగా మారింది. పట్టణ అభివృద్ధి పేరుతో రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్ వంటి పనులు జరుగుతున్నా, పబ్లిక్ టాయిలెట్స్ గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం ప్రజల ఆత్మాభిమానానికి గండిపడేలా ఉంది. ఇది ముఖ్యంగా మహిళలకు మరింత ఇబ్బందిగా మారింది. అశ్వారావుపేట పట్టణానికి చుట్టు పక్కల గ్రామాలు, మండలాల నుంచి ప్రజలు ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల నిమిత్తం తరచూ వస్తూ ఉంటారు. వారు ఇక్కడ పనులు ముగించుకునేవరకూ టాయిలెట్ కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తమ అవసరాలకు అనువైన చోటు లేక, అనేక సార్లు కష్టాలు పడుతున్నారు. ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్ వంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్న తరుణంలో, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేసి ప్రజల కోసం సౌకర్యం అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

## పేదవాడికి అండ తెలుగుదేశం జెండా



**ఇల్లందు, నవంబర్ 12, మహా :** పేదవాడికి అండ తెలుగుదేశం జెండా అని మహబూబాబాద్ పార్లమెంట్ అడహాక్ కమిటీ సభ్యుడు ముద్రగడ వంశీ అన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతంలో భాగంగా 2024 26 సంవత్సరానికి సభ్యత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం ప్రతి ఒకరూ కష్టపడి పని చేయాలని, రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి రూ. 5లక్షల ఇన్స్యూరెన్స్ వర్తిస్తుందని, రేపటి నుండి ప్రతి గ్రామంలో సభ్యత్వం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చాందావత్ రమేష్ బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు శ్యామ్ తీవారి, చెలిమల బాబు, అయ్యోరి నాగరాజు, జెకె జానీ, కొత్తూరు రాంబాబు, మాటేలా రత్నాకర్, దాసరి గోపాలకృష్ణ, దేవరకొండ నవీన్, వాసం వినీత్, కామ ప్రణయ్, సన్నీ, దేశవత్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## మైల్ తండాలో అగ్నిప్రమాదం

**టేకులపల్లి, నవంబర్ 11, మహా:** మండల పరిధిలోని తొమ్మిదో మైల్ తండాలో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అజ్మీర భాష్యకు చెందిన రెండు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. అయ్యప్ప మాల ధారణలో ఉన్న భాష్య మనవడు గణేష్ ఉదయం దీపారాధన పూజ చేసుకుని చేను పనులకు వెళ్లిన అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది. రు. 20 వేలు నగదు, గృహోపకరణాలు, భూమి పట్టాలు దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

### జిల్లాలో 324 ధాన్య కొనుగోలు కేంద్రాల ఏర్పాటు.. అధికారులతో సమీక్ష చేసిన అదనపు కలెక్టర్లు





**ఖమ్మం, నవంబర్ 12, మహా:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులతో కొనుగోలుకు సంసిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలు అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మండల తహశీల్దార్లు, ఎంపీడీఓలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై వారు సమీక్షించారు. మండలాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సన్న, దొడ్డు రకాల కొనుగోళ్లకు ఎన్ని కేంద్రాలు, కేంద్రాలకు సరిపోను స్థల లభ్యత, వసతులు, పరికరాలు తదితర వివరాలను అదనపు కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 2,88,888.78 ఎకరాల్లో వరి సాగుచేయగా, 6,64,444.2 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా ఉన్నట్లు వారు పేర్కొన్నారు. మొత్తం 324 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 31,008 ఎకరాల్లో వరి కోతలు జరగగా, 25672 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరినట్లు అదనపు కలెక్టర్లు అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం 24 గంటల లోపు సంబంధిత మిల్లుకు రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు అందుబాటులో ఉండాలన్నారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాల పై రైతులకు అవగాహన కల్పించాలని, తేమ శాతం, తాల్ సరిచూసుకొని ధాన్యం కేంద్రాలకు తెచ్చే విధంగా చైతన్యపరచాలని తెలిపారు. రోడ్లపై ధాన్యం ఆరబోతపై ప్రమాదాలు జరగకుండా, ప్రజల రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రాల మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే దృష్టికి తేవాలని అదనపు కలెక్టర్లు అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మండల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అధికారులకు క్వార్టర్స్ అలాట్‌మెంట్

**ఇల్లందు, నవంబర్ 12, మహా:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదేశాల మేరకు మంగళవారం ఎస్ఓటూ జీఎం కార్యాలయంలో ఏరియా సింగరేణి అధికారులకు ఏ టైప్ క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ లో ఫ్రెష్ ఎలాట్ మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన అధికారులకు క్వార్టర్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హత కలిగిన వారికి క్వార్టర్ అలాట్మెంట్ ఉత్తర్వులు జారీ చేయబడతాయని పేర్కొన్నారు. క్వార్టర్ ఎలాట్ మెంట్ కమిటీ పూర్తి పారదర్శకంగా ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా నిబంధనలకు అనుగుణంగా జాన్ ఆనంద్ ఆదేశానుసారం ఎస్ ఓ టు జీఎం కార్యాలయం నందు ఏరియా సింగరేణి అధికారులకు ఏ టైప్ క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కౌన్సిలింగ్ లో ఫ్రెష్ ఎలాట్ మెంట్ మరియు చేంజ్ ఆఫ్ క్వార్టర్ కొరకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన అధికారులకు క్వార్టర్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఓ టు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హత కలిగిన వారికి క్వార్టర్ అలాట్మెంట్ ఉత్తర్వులు జారీచేయ బడతాయని, అలాగే క్వార్టర్ ఎలాట్ మెంట్ కమిటీ వారు పూర్తి పారదర్శకంగా, ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా నిబంధనలకు అనుగుణంగా క్వార్టర్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) జీవి. మోహనరావు, జూనియర్ అసిస్టెంట్ జి. వీరన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

### బాలుర ఆశ్రమ పాఠశాలలో

## వైద్య శిబిరం



**టేకులపల్లి, నవంబర్11, మహా:** మండలంలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో కోయగూడెం మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి అక్కడే చికిత్సను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలికాలంలో వచ్చే వ్యాధులైన జలుబు, ఫ్లూ, దగ్గు సైనసైటిస్ బ్రాంకైటిస్,ఆస్తమా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సీజన్ లో శ్వాసకు సంబంధించిన వ్యాధులు ఎక్కువగా రకరకాల వైరస్ బ్యాక్టీరియాల వల్ల వస్తాయని, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు ఒకరి నుంచి ఒకరికి వ్యాపించడానికి ఈ చలికాలం చాలా అనుకూలంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఫ్లూ, జలుబు ఉన్న పిల్లలు కచ్చితంగా మాస్కు ధరించాలన్నారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని కూల్ డ్రింక్స్, చల్లటి నీరు, చల్లటి పదార్థాలు, తీపి పదార్థాలు వాడకపోవడం మంచిదని సూచించారు. అదేవిధంగా ఈ చలికాలంలో ఘాటైన సెంటు వాసనలు కూడా చాలామందికి అలర్జీ కలిగించి తీవ్రమైన శ్వాస సమస్యలు కలుగజేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్, అమర్ సింగ్, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్వైజర్ నాగు బండి వెంకటేశ్వర్లు ,స్టాఫ్ నర్స్ రేష్మ, ఏఎన్ఎంలు రమా, సులోచన, వెంకటరమణ, సునీత తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 24న వన సమారాధాన

**ఖమ్మల అర్బన్, నవంబర్ 12, మహా:** ఖమ్మల కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా ఈనెల 24న వన సమారాధాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కమ్మ మహాజన సంఘం నేతలు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రత్యేకంగా వనంలోనే వన భోజనాలు పెట్టాలనే ఆలోచనతో వినూత్నంగా ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల అటవీ ఏరులో ఎడమ వన సమారాధాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. వన భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేశామని వారు తెలిపారు. పార్టీలకు అతీతంగా జరిగే ఈ కార్యక్రమానికి కమ్మ సోదర, సోదరమణులు అందరూ విజయవంతం చేయాలని కోరారు. వన భోజకాల కార్యక్రమంలో ఈ ఏడాది ఆటపాటలతోపాటు పలు సంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా కబడ్డీ, వాలీబాల్, ఇతరత్రా పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలోని అన్ని ప్రధాన సెంటర్ల నుంచి వెలుగుమట్ల పార్చుకు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి కమ్మ ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానిస్తున్నామని నిర్వహకులు తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

**మణుగూరు, నవంబర్ 12, మహా:** సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రాజుపేట ప్రాంతంలోని గ్రౌండ్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడని, దీంతో అతడిని విచారించే క్రమంలో పారిపోతుండగా పట్టుకొని అతని వద్ద ఒక కేజీ 350 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు స్థానిక సీఐ సతీష్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రామానుజవరం ప్రాంతానికి చెందిన మణికుమార్ అనే వ్యక్తి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని కొనుగోలు చేసి, దానిలో కొంత తాను సేవించినట్లు చెప్పాడని వారు పేర్కొన్నారు. నిందితుని అదుపులో తీసుకొని మంగళవారం జైలుకు పంపించడం జరిగిందన్నారు. నిందితుడు గతంలో కూడా గంజాయి అమ్ముతుండగా మణుగూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయి రిమాండ్ కి వెళ్లి రావడం జరిగిందన్నారు. ప్రస్తుతం రామానుజనంకు చెందిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీలలో ఎస్ఐ ప్రసాద్, కానిస్టేబుల్ రవీందర్, రామారావు, పుల్లం దాస్, వెంకన్న పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**సత్తుపల్లి, నవంబర్12, మహా:** సత్తుపల్లి పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిని స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్ విజయకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఉద్యోగస్తుల హాజరు నమోదు పుస్తకం, రోగుల నమోదు పుస్తకం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్పటల్ లో పరిశుభ్రత పాటించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యానికి వస్తున్న రోగుల పట్ల వైద్యులు మర్యాదతో వ్యవహరించాలని, రోగులకు వైద్యులు అందించే మందుల కంటే మీరు వారి పట్ల వ్యవహరించే తీరు వారిపై ఎక్కువ ప్రభావం చూపుతోందని అన్నారు. ఈ సందర్భంగా రోగులను పరామర్శిస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదవాడి ఆరోగ్య అభ్యున్నతికి ఆరోగ్యశ్రీ వంటి పథకాలను వివరిస్తూ వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీచైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జిల్లాల వార్తలు | DISTRICT NEWS | బుధవారం, హైదరాబాద్ | 13-11-2024
MNN తెలుగు

# ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ కృష్ణ ఆదిత్య

## ఉట్నూర్ మండలంలో కుటుంబ సర్వే, వరిధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



**మహా ప్రతినిధి ఆదిలాబాద్ :** ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ముందుగా ఉట్నూర్ కు చేరుకున్న ఆయనకు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్త పూల మొక్క అందించి స్వాగతం పలికారు.ఉట్నూర్ మండలం దంతన్ పల్లి ,బీర్సాయి పేట్ గ్రామాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్ ఆయా గ్రామాలలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు.బీర్సాయి పేట్ లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు తీరును పరిశీలించారు. ఉట్నూర్ మండలంలో 3 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు బీర్సాయి పేట్, దంతన్ పల్లి, శాంతి నగర్, ఏర్పాటు చేసామని, కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో తేమశాతం చూసుకోవాలని, నిబంధనలను తప్పని సరిగా పాటించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో గన్ని సంచులు, టార్పాలిన్, తేమ యంత్రం, త్రాగునీరు, తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి లబ్ధి పొందాలని తెలిపారు. జీఓ నెం.27 ప్రకారం సన్న ధాన్యం రకానికి 500 రూపాయలు బోనస్ గా ఇవ్వడం జరుగుతుందని, వరి ధాన్యం ధర ఏ గ్రేడ్ రకానికి 2320, సాధారణ రకానికి 2300 రూపాయలు గా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా పకడ్బందీగా కోనుగోలు చేయాలని అన్నారు.అనంతరం అక్కడినుండి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు.పట్టణంలోని రిక్షా కాలనీ, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీ లలో కలెక్టర్ రాజర్షి షా ఐటిడిఎ పిఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రెయిని కలెక్టర్ లతో కలిసి పర్యటించి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆయన తెలిపారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్ లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు , సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో ఆ ప్రాంత ప్రజలకు సమాచారం అందించాలని, ఇంటి యజమానులు అవసరమైన అధార్, రేషన్ కార్డులు, ధరణీ పాస్ బుక్ పత్రాలతో సిద్ధంగా ఉండేలా వారికి తెలియజేయాలని తెలిపారు. ఫారం లో ఉన్న ప్రశ్నలకు ఎన్యుమరేటర్లు ప్రతి అంశాన్ని తప్పనిసరిగా నింపాలని సూచించారు.

# గ్రూప్ 3 పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు





- నవంబర్ 17, 18 న పరీక్షల నిర్వహణ
- 87 పరీక్షా కేంద్రాలలో పరీక్ష రాయనున్న 27 వేల 984 మంది అభ్యర్థులు
- అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ

**ఖమ్మం, నవంబర్ 12, మహా:** గ్రూప్3 పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డితో కలిసి టీజీపీఎస్సీ గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించి, పరీక్షా నిర్వహణ విధుల అధికారులకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆదేశాల ప్రకారం నవంబర్ 17 ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లు, నవంబర్ 18న ఉదయం గ్రూప్ 3 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పక్కాగా జరగాలని అన్నారు. పరీక్ష ముందురోజు, పరీక్ష రోజు పరీక్ష నిర్వహణ విధులు, అధికారులు చేయవలసిన పనులపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. గ్రూప్ 3 పరీక్షకు జిల్లాలో మొత్తం 27 వేల 984 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, వీరి కోసం 87 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం ఖమ్మంలోని విజయ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్, ఎస్.బి.ఐ.టి ప్రిన్సిపాల్ లను రీజనల్ కో ఆర్డినేటర్లుగా నియమించడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రాలు, ఇతర ముఖ్యమైన సామాగ్రి ప్రభుత్వ వైద్య కళాశాల ఓల్డ్ ట్రెజరీ రూమ్ లో భద్రపరచడం జరుగుతుందని అన్నారు. ప్రతి 3 నుంచి 5 పరీక్ష కేంద్రాలకు తహశీల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసామని, ఏ దశలోనూ పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రూప్3 పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ అవసరమైన మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రశ్నా పత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు వీలుగా ఎంపీడీవోలను జాయింట్ రూట్ అధికారులుగా నియమించామని అన్నారు. ప్రతి 150 మంది అభ్యర్థులకు ఒక జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ సిబ్బందిని ఐడెంటిఫికేషన్ అధికారులుగా నియమించామని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్వో. ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, పరీక్షల కోఆర్డినేటర్లు కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం

## డీసీసీబీ చైర్మన్ ప్రజా సేవాభవన్ లో చేరికల కార్యక్రమానికి హాజరు





**మహా ప్రతినిధి ఆదిలాబాద్:** కంది శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయం, ప్రజా సేవా భవన్ లో ఆదిలాబాద్ పట్టణంలోని నిషాన్ ఘాట్ కాలనీవాసులు భారీ సంఖ్యలో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కండువాలు కప్పి డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కంది శ్రీనివాస రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో సరైన రోడ్లు లేవని, విద్యుత్ సౌకర్యం, నీటి సదుపాయంలేదని అన్నారు. వాటన్నింటి పరిష్కారానికి అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ద్వారా కృషి చేస్తామని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అన్ని తప్పుడు హామీలిచ్చి రెండు సార్లు గద్దెనెక్కిందన్నారు. ప్రస్తుత ఆదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్ సైతం ప్రజలకు చేసిందేమిలేదని అన్నారు.దమ్ముంటే కేంద్ర ప్రభుత్వంపై పాయల్ శంకర్ పోరాటంచేసి ప్రజాసమస్యలు పరిష్కరించాలని హితవు పలికారు.ఎవ్వరు అధైర్యపడొద్దని, సమస్యలను కంది శ్రీనివాస రెడ్డి ద్వారా మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని పార్టీలో చేరినవారికి భరోసా కల్పించారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,కౌన్సిలర్లు బండారి సతీష్,జాఫర్ అహ్మద్,తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్,నాయకులు ఎం.ఏ కయ్యుమ్,బండి దేవిదాస్ చారి,సుధాకర్ గౌడ్,నిమ్మల ప్రభాకర్,మొహమ్మద్ రఫీక్,మానే శంకర్,అశోక్,నైతం రమేష్,వామన్, మోర ఆశన్న,శ్రీనివాస్,అల్లాబకష్,నాగన్న,అంజాద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# సత్తు మల్లేష్‌ను కలిసిన బోథ్ నాయకులు



**మహా ఆదిలాబాద్ :** టిపిసిసి ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ ను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ నియోజకవర్గంలో ప్రస్తుత పార్టీ పరిస్థితిపై ఆరాతీసి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలని నేతలకు మల్లేష్ సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని తెలిపారు. ప్రజలతో మమేకమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, ప్రజాపాలన లక్ష్యాలను, కులగణన ఆవశ్యకతను గ్రామాల్లోకి తీసుకువెళ్లాలని నేతలకు సూచించారు .ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాజుల పోతన్న తదితరులు పాల్గొన్నారు

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు అధికారంగా నిర్వహించ పోవడం శోచనీయం-మైనార్టీ నాయకులు

## ప్రెస్ మీట్లో కలెక్టర్, జిల్లా సంక్షేమ శాఖాధికారి నిర్లక్ష్యం పై మండిపాటు



**మహా ప్రతినిధి ఆదిలాబాద్:** దేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు జాతీయ విద్యాదినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సి ఉన్న జిల్లా కలెక్టర్ , జిల్లా సంక్షేమ శాఖ పట్టించుకోలేదని మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆయన జయంతి వేడుకలను అధికారికంగా జరపక పోవడం బాధాకరమన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి విద్యాశాఖ మంత్రిగా ఎన్నో సేవలందించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించలేదని కలెక్టర్ , జిల్లా సంక్షేమ శాఖాధికారి నిర్లక్ష్యం పై మండిపడ్డారు. ఈ విషయమై అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సర్వే సాకు చూపి జరపకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహానీయుల చరిత్ర భావితరాలకు తెలిసేలా వేడుకలను జరపాలన్నారు.ఈ మీడియా సమావేశంలో కౌన్సిలర్ జాఫర్ అహ్మద్ , ఖిజర్ పాషా , పత్తి ముజ్జు, మహ్మద్ రఫీఖ్, కలీమ్ ,అతిఖుర్ రహ్మాన్ , షేక్ మొయిన్ ,ఇర్ఫాన్ , రషీద్ , కర్మ, అఖిల్, అబుతల్హా,సయ్యద్ షౌకత్ అలీ, హకీం, నదీం తదితరులు పాల్గొన్నారు.

# నడుస్తోన్న బస్సులోంచి దూకిన మహిళ

## తీవ్ర గాయాలు - ఆస్పత్రికి తరలింపు

**మహా ప్రతినిధి నిర్మల్ :** నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రంలో ఓ మహిళ నడుస్తోన్న బస్సులోంచి అకస్మాత్తుగా కిందకు దూకింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ కు చెందిన ఓ కుటుంబం భైంసా మండంల దేగాం గ్రామంలో హైదరాబబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సెక్కారు. ముథోల్ కంటి ఆస్పత్రి స్టేజ్ రాగానే ఓ మహిళా ప్రయాణికురాలు ఒక్కసారిగా బస్సు ఫుట్ బోర్డ్ పై నుండి కిందకు దూకింది.దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 లో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.అయితే కిందకు దూకడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



# రేపు మదనపల్లిలో మంత్రి సీతక్క పర్యటన

**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, మహా:** మండలంలోని మదనపల్లి గ్రామంలో గల అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ధ్వజారోహణతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కన్నుల పండుగగా సాగాయి. 16వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా పలు పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించగా పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధ, గురువారాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, బుధవారం జరిగే పూజా కార్యక్రమాలలో మంత్రులు ధనసరి అనసూయ( సీతక్క), కొండ సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ లు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని మాజీ మంత్రి పోరిక జగన్ నాయక్ తెలిపారు. పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

# కులగణనను అడ్డుకున్న గ్రామస్తులు



**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, మహా:** కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్ గ్రామంలో 3వ రోజు కులగణన సర్వేకి వచ్చిన ఎన్యూమరేటర్, ఏపీడీ మరియు ఐలాపూర్ స్పెషల్ అధికారులను ఐలాపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య మాట్లాడుతూ తమ గ్రామం భారత రాజ్యాంగ గెజిట్ లో 5వ షెడ్యూల్డ్ ఉన్నప్పటికీ ట్రైబల్ చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరించటం బాధాకరమని, ప్రజలు ఎన్నుకోబడిన ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ప్రజలకు మౌలిక సౌకర్యాలు కలిపించకుండా దొడ్డిదారి సర్వేలు నిర్వహించి ఓట్లేసిన ప్రజలను పక్కతోవపట్టిస్తున్నారన్నారు. అంతేకాకుండా తమ రోడ్డుని కూడా పక్కదారి పట్టించి కుర్చీలకే పరిమితం అవుతున్నారన్నారు. ఓట్లు కావాలి కానీ అభివృద్ధికి తమను దూరంగా ఎందుకు ఉంచుతున్నారన్నారని ప్రశ్నించారు. తాము కొనే ప్రతి వస్తువు నుంచి సర్వీస్ టాక్స్, జీఎస్టీ రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుతలేవా అని ప్రశ్నించారు. తమ గ్రామానికి రోడ్డు కావాలని ప్రతి అధికారికి అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినా, స్పందించడంలేదన్నారు. తమ గ్రామానికి తారు రోడ్డు నిర్మించేవరకు ప్రభుత్వం చేపడుతున్న కుటుంబ సర్వేను జరగనివ్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలను కూడా బహిస్కరిస్తామన్నారు. షెడ్యూలు తెగ ఐలాపూర్ గ్రామస్తులందరూ ముక్తకంఠంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోడె సుధాకర్, వెంకటయ్య, మల్లేష్‌బాలయ్య, చంద్రయ్య వెంకటేష్, సూర్యం, సమ్మయ్య, కొమరం భీమ్ యూత్ లక్ష్మీ నారాయణ, శివకుమార్, సధానందం, సురేష్‌అన్వేష్, లడ్డు, రాజేష్, రవి సావిత్రి, అరుణ, పద్మ, లక్ష్మీ, రజితలతోపాటు గ్రామస్తులందరు పాల్గొన్నారు.

# అధికారులపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలి




## అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జీ

**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, మహా:** వికారాబాద్ జిల్లాలో సోమవారం జిల్లా కలెక్టర్, అధికారులపై కొంతమంది వ్యక్తులు దాడి చేయడం అమానుషమని, వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలంటూ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) సీహెచ్. మహేందర్ జీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములను సేకరించే ప్రక్రియలో భాగంగా రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడం కోసం కలెక్టర్, అధికారులు వెళ్లిన క్రమంలో కొంతమంది వ్యక్తులు ముందస్తు ప్లాన్ ప్రకారం దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. అధికారులపై దాడి చేయడమే కాకుండా వాహనాలను ధ్వసం చేయడం బాధాకరమని, ఏకంగా కలెక్టర్ పైన దాడి చేయడం తాము ఎన్నడూ చూడలేదని మహేందర్ జి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దాడిని ఖండిస్తూ జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధులు నిర్వహించడం జరిగిందన్నారు. అధికారులపై ఎక్కడ దాడి చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

# పత్తి తేమ శాతంలో కొంత సడలింపివ్వాలి

## రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు



**మహా ప్రతినిధి ఆదిలాబాద్ :** సీసీఐ , ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోలులో తేమ శాతం లో కొంత సడలింపివ్వాలని అప్పుడే రైతులకు ఆశాజనకంగా ఉంటుందని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్నఅన్నారు. మంగళవారం బోథ్ మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులకు రైతులు తీసుకొచ్చిన పత్తిని పరిశీలించారు. తేమ శాతం ఎక్కువగా తక్కువగా రావడంతో రైతులకి ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఉందని, తేమ శాతన్ని సడలింపు ఇచ్చినట్లయితే రైతులకి కొంతలో కొంతయినా ఆర్థిక తోడ్పాటు అందుతుందని ఆయన అన్నారు.ఇక్కడి నల్లరేగడి భూమి కారణంగా రైతులు మొదటి సారి తీసిన పత్తికి తేమ శాతం అధికంగా ఉంటుందని కావున సీసీఐ అధికారులు పత్తిలో తేమ శాతంలో మినహాయింపునిచ్చి కొనుగోలు చేయవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆయన వెంట రైతులు చంద్రకాంత్, రాములు, అశోక్ భషిర్ తదితరులు ఉన్నారు.

# 14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్

**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 12, మహా:** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించనునట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారమని, వారం రోజుల పాటు జరిగే వారోత్సవాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, 14వ తేదీన ముఖ్య అతిథిచే వారోత్సవాల ప్రారంభం కార్యక్రమం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ ను స్మరించుకునే కార్యక్రమం ఉంటుందన్నారు. 17న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 18న వకృత్వ పోటీలు, 19 న మహిళా దినోత్సవంన రంగోలి పోటీ, 20న ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో విద్యార్థులు, మేధావులు, అన్ని రంగాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# వ్యాపారులపై కలెక్టర్ ఆగ్రహం..!

- ప్రైవేట్ వ్యాపారుల లైసెన్సుల రద్దు చేయండి
- పత్తి ధర తగ్గింపు పై అసహనం
- రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, నవంబర్ 12, మహా:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ప్రైవేట్ వ్యాపారులపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి పంటను కొనే విషయంలో వ్యాపారులు సాకులు చెప్పి తక్కువ ధరకు కొనుగోలు చేయడంపై అసంతృప్తి చెందారు. ప్రభుత్వం నిబంధనలకు భిన్నంగా రైతుల నుండి పత్తి పంటను కొనుగోలు చేసిన ప్రైవేట్ వ్యాపారుల లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా వ్యాపారులకు వత్తాసు పలుకుతున్న అధికారులను సైతం మందలించారు. మంగళవారం జిల్లా కలెక్టర్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తిని రైతుల వద్ద నుండి మద్దతు ధర కంటే తక్కువగా చెల్లించి కొనుగోలు చేసినట్లు తెలిసి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి పంటకు లభిస్తున్న ధర మొదలగు వివరాలను కలెక్టర్ రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్ లో పత్తి పంట తేమ శాతం పరిశీలించకుండా కొనుగోలు చేయరాదని, ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. పత్తి పంట తేమ శాతం పరిశీలించి 12 శాతం వరకు ఉంటే మద్దతు ధర చెల్లించాలని తెలిపారు. తేమ శాతం పరిశీలించకుండా రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు పత్తి పంట కొనుగోలు చేయడం దారుణమని, దీనిని అరికట్టేందుకు మార్కెటింగ్ శాఖ అప్రమత్తంగా ఉండాలని, మద్దతు ధర కంటే తక్కువకు పంట కొనుగోలు చేసేందుకు వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

నిబంధనలను పరిశీలించకుండా రైతులను మోసం చేస్తూ కొనుగోలు చేయడాన్ని కలెక్టర్ తీవ్రంగా తప్పుపట్టారు. రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించాలని, ఒక రెండు రోజులు ఆరబెట్టుకొని వస్తే మద్దతు ధర లభిస్తుందని తెలిపాలని, లేదా పంట ఇప్పుడే అమ్మాలంటే నిబంధనల ప్రకారం ధర చెల్లించాలని, ఇష్టానుసారం తేమ శాతం పరిశీలించకుండా కొనుగోలు చేయడానికి వీలు లేదని కలెక్టర్ వ్యాపారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డులో ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసే ప్రతి పంట ప్రక్రియను మార్కెటింగ్ అధికారులు నిరంతరం పరిశీలించాలని, రైతులకు మద్దతు ధర లభించేలా చూడాలని, తేమ శాతం దానికి అనుగుణంగా ఉండే ధర వివరాలను రైతులకు తెలియజేయాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులకు ఆదేశించారు. రైతులను మోసం చేస్తూ తక్కువ ధరకు పంట కొనుగోలు చేసిన ప్రైవేట్ వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని, తేమ శాతం ప్రకారం రైతులకు ధర చెల్లించని పక్షంలో లైసెన్స్ రద్దు చేయాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. మార్కెట్ యార్డులో అవసరమైతే అదనంగా పది మంది సిబ్బందిని తేమ శాతం పరిశీలనకు విధులలో చేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఎ. అలీం, మార్కెట్ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రూపాయికి ట్రంప్ సెగ

**కరెన్సీ విలువ 8-10 శాతం తగ్గొచ్చని ఎస్బీఐ అంచనా.. ఇప్పటికే జీవనకాల కనిష్ఠానికి క్షీణించిన రుపీ**

**డాలర్‌తో పోల్చితే మారకపు రేటు 84.38 వద్దకు పతనం.. ఫారెక్స్ మార్కెట్‌లో వరుసగా నీరసిస్తున్న భారతీయ కరెన్సీ**

**న్యూఢిల్లీ :** వచ్చే నాలుగేండ్లలో రూపాయి మారకం విలువ 810 శాతం పడిపోవచ్చని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ అంచనా వేస్తున్నది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో తాజాగా ఎస్బీఐ ఓ నివేదికను విడుదల చేసింది. ఇందులో ట్రంప్ హయాంలో డాలర్‌తో పోల్చితే రుపీ మారకపు రేటు మరో రూ.10దాకా క్షీణించవచ్చని అభిప్రాయపడటం గమనార్హం. '2024 అమెరికా అధ్యక్ష ఎన్నికలు: భారత్, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ 2.0 ప్రభావమెంత?' అన్న శీర్షికతో ఈ రిపోర్టు వచ్చింది.

**మిశ్రమ ఫలితాలు**

ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠమెక్కితే భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఉండవచ్చని ఎస్బీఐ విశ్లేషిస్తున్నది. ముందుగా దేశానికి ఎదురయ్యే సవాళ్ల విషయానికొస్తే.. అమెరికాకు భారత్ నుంచి వెళ్లే ఎగుమతులపై టారీఫ్‌లు పెరగవచ్చని, హెచ్ 1బీ వీసాలపై కొత్తగా ఆంక్షలు రావచ్చని, ఫారెక్స్ మార్కెట్‌లో ఒడిదొడుకులకు ఆస్కారం ఉండొచ్చని అంటున్నది. ఈ క్రమంలోనే డాలర్ విలువ మరింత బలోపేతమై రూపాయి మారకం విలువ పతనం కావచ్చని అంచనా వేస్తున్నది. ఇందులో భాగంగానే 810 శాతం మేర రుపీ నష్టపోవచ్చని హెచ్చరిస్తున్నది. అయితే భారతీయ తయారీ రంగానికి ప్రోత్సాహకాలు లభించవచ్చని, కొత్త మార్కెట్లకు ఎగుమతులు విస్తరించే వీలుందని, ఆర్థిక స్వావలంబన పెరగవచ్చని కూడా చెప్తున్నది.

**తొలిసారీ అంతే..**

అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి ఎన్నికైనప్పుడూ రూపాయి విలువ దారుణంగా దెబ్బతిన్నదని ఎస్బీఐ ఈ సందర్భంగా గుర్తుచేసింది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌కు ముందు అధికారంలో ఉన్న ట్రంప్ హయాం లో డాలర్‌తో రుపీ మారకపు రేటు 11 శాతం పతనమైందని చెప్పింది. అయితే జో బైడెన్ హయాంలో కంటే ఇది తక్కువేనని కూడా పేర్కొన్నది. హెచ్ 1బీ వీసాల నిబంధనల్ని కఠినతరం చేస్తే ఐటీ, దాని అనుబంధ రంగాల సంస్థలపై ఖర్చుల భారం పెరుగుతుందని కూడా చెప్తున్నది. దీనివల్ల అమెరికా కార్యకలాపాల కోసం ఇక్కడివారిని ఉద్యోగాల్లోకి తీసుకోలేకపోవచ్చని, దేశీయ నియామకాలపై ఇది ప్రభావం చూపవచ్చని కూడా విశ్లేషించింది.






## మస్క్ స్టార్‌లింక్‌కు లైసెన్స్ అంశంపై కీలక వ్యాఖ్యలు

**టెలికం మంత్రి జ్యోతిరాధిత్య సింధియా**

భారత్‌లో శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేల కోసం ఎలాన్ మస్క్ స్టార్‌లింగ్ సహా ఇతర కంపెనీలకు లైసెన్సులు మంజూరు చేసే అంశంపై కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కీలక వ్యాఖ్యలు చేశారు. అన్ని భద్రతా పారామితులను కలిగి ఉన్నట్లయితే శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు సంబంధించిన లైసెన్సులు స్టార్‌లింక్‌తో సహా ఎవరికైనా ఇవ్వవచ్చన్నారు. తాము భద్రతా సమస్యలను పరిగణనలోకి తీసుకునేలా చూడాలని.. తమకు నిర్దిష్ట ఫార్మాట్ ఉందని.. దాన్ని పాటించాలని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కంపెనీలు షరతులను పాటిస్తే లైసెన్సులు జారీ చేస్తామని.. మార్గదర్శకాలను అనుసరిస్తేనే తాము సంతోషిస్తామన్నారు. ఎలోన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంపెనీ భారత్‌లో సేవలు ప్రారంభించేందుకు లైసెన్స్ పొందేందుకు అన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శాటిలైట్ ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్ అన్ని అవసరాలను తీర్చే ప్రక్రియలో ఉందని, ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కంపెనీలకు లైసెన్స్ లభిస్తుందన్నారు. 'లైసెన్స్ పొందడానికి వారు (స్టార్‌లింక్) అన్ని నిబంధనలను పాటించాలని.. భద్రతా కోణంలోనూ చూడాల్సి ఉందని ఓ ప్రశ్నకు జ్యోతిరాధిత్య సింధియా సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం, భారతి గ్రూప్ ఆధారిత వన్ వెబ్, జియో ఎస్ఈఎస్ జాయింట్ వెంచర్ అయిన జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్‌కు ప్రభుత్వం లైసెన్స్‌లను జారీ చేసిన విషయం తెలిసిందే.

## ట్రంప్ ఎన్నికతో రికార్డుల్లో బిట్ కాయిన్ కొత్త పుంతలు..

**90 వేల డాలర్లకు చేరువలో క్రిప్టో మేజర్..!**




అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవ్వడంతో క్రిప్టో కరెన్సీ మేజర్ బిట్‌కాయిన్ రికార్డుల్లో కొత్త పుంతలు తొక్కుతోంది. తొలిసారి 90 వేల డాలర్లకు చేరువలో వచ్చింది. సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో 80 వేల డాలర్లు దాటిన బిట్‌కాయిన్ రాత్రికల్లా 89,100 డాలర్లకు చేరుకుందని కాయిన్ మెట్రిక్స్ తెలిపింది. సోమవారం ఒక్కరోజే 12 శాతం బిట్ కాయిన్ లాభ పడింది. ఇంట్రా డే ట్రేడింగ్‌లో బిట్ కాయిన్ 89,623 పాయింట్ల నుంచి 89,637 పాయింట్ల గరిష్టానికి దూసువెళ్లింది. భారత్ కరెన్సీలో ఒక బిట్ కాయిన్ విలువ సుమారు రూ.75 లక్షల పై చిలుకే. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఈ ఏడాది చివరికల్లా లక్ష డాలర్లకు చేరుతుందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైనట్లు గత బుధవారం వెల్లడైనప్పటి నుంచి బిట్ కాయిన్, ఇతర క్రిప్టో కరెన్సీలు దూసుకెళ్తున్నాయి. గత బుధవారం నుంచి ఇప్పటి వరకూ బిట్ కాయిన్ విలువ 30 శాతం పై చిలుకు వృద్ధి చెందింది. మరోవైపు, త్వరలో యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న సంకేతాలు కూడా బిట్ కాయిన్ విలువ పెరగడానికి కారణాలుగా తెలుస్తోంది.

## సరికొత్త మారుతి డిజైర్

**ప్రారంభ ధర రూ.6.79 లక్షలు**





**న్యూఢిల్లీ :** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ సరికొత్త మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. కాంప్యాక్ట్ సెడాన్ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా నయా డిజైర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు రూ.6.79 లక్షలు మొదలుకొని రూ.10.14 లక్షల గరిష్ఠ స్థాయిలో లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. నాలుగో జనరేషన్‌గా విడుదల చేసిన ఈ కారు నాలుగు రకాల్లో లభించనున్నది. 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ మాడల్ మాన్యువల్ గేర్‌బాక్స్ కారు 24.79 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, ఏఎంటీ బాక్స్ మాడల్ 25.71 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. అలాగే త్వరలో అందుబాటులోకి రానున్న సీఎన్‌జీ మాడల్ కిలోకు 33.73 కిలోమీటర్లు మైలేజీ ఇవ్వనున్నది. టిగోర్, అమేజ్, హ్యుందాయ్ ఔరాలకు పోటీగా సంస్థ ఈ వాహనాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా మారుతి సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాషీ టకేచి మాట్లాడుతూ..భారత్‌లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పోటీని మరింత పెంచాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఈ డిజైర్ కార్లు 30 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి.



## శారీరక, మానసిక ప్రశాంతతకు కేరాఫ్.. భూటాన్‌లో ఆనంద నగరం

**పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కూడా.. 2,500 చ.కి.మీ విస్తీర్ణంలో నిర్మాణం**



స్మార్ట్ సిటీ, ఫార్మా సిటీ, సైబర్ సిటీ, హైటెక్ సిటీ.. ఇలా ఎన్నెన్నో కొంగొత్త నగరాల గురించి తరుచూ వినే ఉంటాం. అయితే, పొరుగు దేశం భూటాన్‌లో మైండ్‌ఫుల్‌నెస్ సిటీ నిర్మాణాన్ని అక్కడి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నది. దీన్ని ఆనంద నగరంగా కూడా పిలుస్తున్నారు.

**ఏమిటీ నగరం?**

భూటాన్‌కు దక్షిణంగా భారత సరిహద్దుల్లో 2,500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అక్కడి ప్రభుత్వం మైండ్‌ఫుల్‌నెస్ సిటీ నిర్మాణాన్ని సోమవారం ప్రారంభించింది. దీన్ని 'గెలెఫు మైండ్‌ఫుల్‌నెస్ సిటీ' (జీఎంసీ)గా నామకరణం చేశారు. దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే, ఇక్కడ ప్రత్యేక నియమాలు, నిబంధనలు వర్తిస్తాయని అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేక వసతులు ఉంటాయన్నారు.

**ఎందుకు?**

ఏ కొత్త నగర నిర్మాణమైనా ప్రజల ఆవాసాలకు, పరిశ్రమల ఏర్పాటుకు, పెట్టుబడులను ఉద్దేశించే జరుగుతుంది. అయితే, ఈ ఆనంద నగరం మాత్రం ప్రజలకు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అందించేందుకు తద్వారా సంతోషాన్ని అందించేందుకు తీసుకొస్తున్నారు. ఈ నగరంలో కాలుష్యమనేదే ఉండదు. ఎందుకంటే ఇంధనంతో నడిచే వాహనాలు ఇక్కడ అనుమతించబోరు. కర్బన ఉద్గారాలు లేని సైకిల్స్, ఎలక్ట్రిక్ వాహనాలకే అనుమతి ఉంటుంది. అంతేకాదు ఔషధ మొక్కలు, పూలవనాలు, యోగాకు ప్రత్యేక కేంద్రాలు, ఉల్లాసానికి, ఆటవిడుపుకు పార్కులు, హాల్స్, ఆరోగ్యానికి అత్యుత్తమ దవాఖానలు, శారీరక దారుఢ్యానికి వెల్‌నెస్ సెంటర్లు, ఆధ్యాత్మిక కేంద్రాలు, మనుషుల మధ్య ఆత్మీయానుబంధాలను పెంచేందుకు పబ్లిక్ కమ్యూనిటీ యాక్టివిటీ కేంద్రాలు ఇలా అన్నింటినీ ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. సంప్రదాయ వ్యవసాయం, కళాపోషణ, గ్రీన్ ఎనర్జీలో కొత్త పరిశోధనలు, హైడ్రో ఎలక్ట్రిక్ డ్యామ్, డ్రైపోర్టు, ఎయిర్‌పోర్ట్, వ్యాపార కార్యకలాపాలకు కూడా ఇక్కడ చోటు ఉండనుంది.

**నిరుద్యోగానికీ చెక్**

మైండ్‌ఫుల్‌నెస్ సిటీ నిర్మాణంతో కొత్త పెట్టుబడులే కాకుండా ఇక్కడికి వచ్చే పర్యాటకులకు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా లభిస్తుందని భూటాన్ ప్రభుత్వం తెలిపింది. దేశంలోని నిరుద్యోగాన్ని ఈ నగరం కొంతలో కొంత తగ్గించవచ్చని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ నగర నిర్మాణానికి కూడా పెట్టుబడుదారుల నుంచి నిధులను స్వీకరిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

## తృష్ణా రేకు మిస్ టీన్ యూనివర్స్-2024 కిరీటం.. ఎవరీ తృష్ణా రే..!




ఈ ఏడాదికిగాను 'మిస్ టీన్ యూనివర్స్' కిరీటాన్ని భారత్‌కు చెందిన తృష్ణా రే దక్కించుకున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాలోని క్లింబరీ వేదికగా ఈ అందాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పెరూ, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, కెన్యా, పోర్చుగల్, నమీబియా, నెదర్లాండ్స్ సహా వివిధ దేశాలకు చెందిన అందగత్తెలు పాల్గొన్నారు. పోటీల్లో ఉన్న అందరినీ వెనక్కినెట్టి 19 ఏళ్ల తృష్ణా రే మిస్ టీన్ యూనివర్స్ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. పెరూకు చెందిన అన్నే థోర్సెన్, నమీబియాకు చెందిన ప్రెషియస్ ఆండ్రీ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. తృష్ణా రే కల్నల్ దిలీప్ కుమార్ రే, రాజశ్రీ రేల కుమార్తె. ఆమె ఒడిశా రాష్ట్రానికి చెందిన యువతి. ప్రస్తుతం భువనేశ్వర్‌లో కేఐఐటీ యూనివర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ చదువుతున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన మిస్ టీన్ యూనివర్స్ ఇండియా పోటీల్లో విజేతగా నిలిచిన తృష్ణా.. తాజాగా అంతర్జాతీయ వేదికపై జరిగిన పోటీల్లోనూ విజయం సాధించారు. ఈ పోటీలకు సంబంధించిన వీడియోను నిర్వాహకులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా పలువురు నెటిజన్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తృష్ణా విజయానికి సంబంధించిన విషయాలను కేఐఐటీ ఇన్‌స్టిట్యూట్ తన అధికారిక వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసింది. తృష్ణా గెలుపు దేశానికి గర్వకారణమని పేర్కొన్నది.

## కేర్ కేంద్రాల్లో వేధింపులు

**క్షమాపణలు చెప్పిన న్యూజిలాండ్ ప్రధాని**



**క్రైస్ట్‌చర్చ్:** కేర్ సెంటర్లలో వేధింపులకు గురైన బాధితులకు న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లగ్జాన్ క్షమాపణలు చెప్పారు. చరిత్రాత్మకమైన ఆ క్షమాపణలను ఆయన పార్లమెంట్‌లో తెలిపారు. 1950 నుంచి 2019లో దేశంలోని వివిధ రాష్ట్రాలు, మతపరమైన సంరక్షణ కేంద్రాల్లో సుమారు రెండు లక్షల మంది చిన్నారులు, వయోజనలు వేధింపులకు గురైనట్లు తాజాగా ప్రభుత్వం ఓ నివేదికను రూపొందించింది. వీరిలో ఎక్కువ శాతం మావోరి, పసిఫిక్ తెగ ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. మానసిక, శారీర వైకల్యం ఉన్న వారు కూడా ఉన్నారు.

అయితే కేర్ సిస్టమ్‌ను సంస్కరించాలని న్యూజిలాండ్ ప్రభుత్వం తీర్మానించింది. తమ ప్రభుత్వం, గత ప్రభుత్వాల తరపున బాధితులకు క్షమాపణలు చెబుతున్నట్లు ప్రధాని లగ్జాన్ తెలిపారు. అది చాలా భయానకమైందని, గుండె పగిలేలా ఉందని, అలాంటివి ఎప్పటికీ జరగవద్దు అని లగ్జాన్ పేర్కొన్నారు. దాదాపు ఆరేళ్ల పాటు జరిగిన విచారణ తర్వాత రిపోర్టును రిలీజ్ చేశారు. 2300 మంది బాధితులను ఇంటర్వ్యూ చేశారు.

## ట్రక్కును ఢీకొన్న ఇన్నోవా కారు

**ఆరుగురు విద్యార్థులు మృతి**



**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లో రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. ఆ రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్‌లో జరిగిన కారు ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ట్రక్కు, ఇన్నోవా కారు ఢీకొన్న ఘటనలో ఈ విషాదం నెలకొన్నది. తెల్లవారుజామున రెండు గంటలకు ఓఎన్జీసీ కూడలి వద్ద ప్రమాదం జరిగింది. కారులో ఏడుగురు విద్యార్థులు ఉన్నట్లు తెలిసింది. దాంట్లో ముగ్గురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలు దుర్మరణం పాలయ్యారు. ఆ ఆరుగురూ స్పాట్‌లోనే ప్రాణాలు వదిలారు. ఒక విద్యార్థి మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులంతా ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతున్నట్లు తెలిసింది. భీకరంగా ట్రక్కు ఢీకొనడంతో.. ఇన్నోవా ముక్కలైంది. కారును కట్ చేసి మృతదేహాలను వెలికి తీయాల్సి వచ్చింది. ట్రక్కు డ్రైవర్ అక్కడ నుంచి తప్పించుకున్నాడు.

## భారత సైన్యం అరుదైన ఫీట్..

**హై ఆటిట్యూడ్‌లో ఎగిరిన ప్రచండ హెలికాప్టర్**



**మహా, జాతీయం :** భారత సైన్యం చారిత్రాత్మక ఫీట్‌ను సాధించింది. ప్రచండ హెలికాప్టర్‌తో అత్యంత ఎత్తులో విజయవంతంగా పరీక్షించింది. ఈ హెలికాప్టర్ భారత్‌లోనే తయారుకావడం విశేషం. భారత సైన్యం వీడియోను అఫీషియల్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. భారత సైన్యం యుద్ధ సన్నద్ధతను బలోపేతం చేస్తుందని సైన్యం పేర్కొంది. ప్రచండ ఒక తేలికపాటి యుద్ధ హెలికాప్టర్. భారీ ఆయుధాలు, ఇంధనంతో కూడా 5వేల మీటర్ల ఎత్తులో టేకాఫ్, ల్యాండ్ అయ్యే సామర్థ్యం ఉన్నది. ఈ హెలికాప్టర్ శత్రువుల రాడార్లకు చిక్కకుండా ఉండేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడారు. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ప్రచండ్ హెలికాప్టర్‌ను తయారు చేసింది. ఈ హెలికాప్టర్‌లో ఫ్రెంచ్ ఇంజిన్లను అమర్చారు. 1999లో కార్గిల్ యుద్ధ సమయంలో భారత సరిహద్దు నుంచి ఖచ్చితమైన దాడులు చేయగల స్వదేశీ తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ అవసరమని భావించింది.

# మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | క్రీడా వార్తలు | SPORTS NEWS | బుధవారం, హైదరాబాద్ | 13-11-2024


## ఏడాది తర్వాత తిరిగి భారత క్రికెట్ జట్టులోకి లాలాజీ..!



ఆస్ట్రేలియాతో బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీకి ముందు భారత క్రికెట్ జట్టుకు ఒక శుభవార్త అందింది. స్టార్ పేసర్ మహమ్మద్ షమీ మైదానంలోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. చీలమండ గాయంతో దాదాపు ఏడాదిగా జట్టుకు దూరంగా ఉన్న షమీ.. ఇప్పుడు బెంగాల్ తరపున రంజీ ట్రోఫీ ఆడబోతున్నాడు. మధ్యప్రదేశ్‌తో రేపు (బుధవారం) జరిగే ఐదో రౌండ్ రంజీ మ్యాచ్‌లో బెంగాల్ తరపున షమీ బరిలోకి దిగనున్నాడు. ఈ విషయాన్ని బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ వెల్లడించింది.

వాస్తవానికి కర్ణాటకతో జరిగిన నాలుగో రౌండ్ రంజీ మ్యాచ్‌లోనే షమీ బరిలోకి దిగాల్సి ఉండగా.. పూర్తి ఫిట్‌నెస్ సాధించని కారణంగా అది సాధ్యపడలేదు. ప్రస్తుతం గాయం నుంచి పూర్తిగా కోలుకొని ఫిట్‌నెస్ సాధించిన షమీ.. బెంగాల్ తరపున ఆడేందుకు బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ పొందాడు. రంజీ ట్రోఫీలో అతను రిథమ్ అందుకొని మునపటిలా సత్తా చాటితే ఆస్ట్రేలియా ఫ్లైట్ ఎక్కుతాడు. సిరీస్ మధ్యలోనైనా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ఎంట్రీ ఇస్తాడు.

గత ఏడాది నవంబర్‌లో వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో చివరిసారిగా టీమిండియా తరపున బరిలోకి దిగిన షమీ.. చీలమండ గాయంతో జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దాంతో ఏడాది కాలంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇటీవలే గాయం నుంచి పూర్తిగా కోలుకొని ప్రాక్టీస్ ప్రారంభించాడు. దాంతో న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్ లేదా సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌తో రీఎంట్రీ ఇస్తాడని అంతా భావించారు. కానీ ఆ రెండు సిరీస్‌లకు సెలెక్టర్లు ఆయనను ఎంపిక చేయలేదు. ఇటీవలే బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో మహమ్మద్ షమీ రిహాబిలిటేషన్ పూర్తి చేసుకొని ఫిట్‌నెస్ టెస్ట్ కూడా పాసయ్యాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చే ముందు దేశవాళీ క్రికెట్ ఆడుతానని ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. రంజీ ట్రోఫీలో రెండు మ్యాచ్‌లు ఆడి సత్తా చాటి.. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడుతానని అన్నాడు. అయితే ప్రస్తుతం బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ఎంపిక చేసిన జట్టులోనూ షమీకి చోటు దక్కలేదు. నవంబర్ 22 నుంచి భారత్‌ఆస్ట్రేలియా జట్ల మధ్య ఐదు టెస్ట్‌ల బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ జరగనుంది.

## నిష్కకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిష్క అగర్వాల్ సత్తాచాటింది. మొత్తం 14 దేశాలకు చెందిన జిమ్నాస్ట్‌లు పోటీపడ్డ జింపీస్ జిమ్నోవా కప్‌లో నిష్క వాల్ట్ ఈవెంట్‌లో కాంస్య పతకంతో మెరిసింది. తొలిసారి సీనియర్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన నిష్క అద్భుత ప్రదర్శన కనబరిచింది. ప్రస్తుతం గాడియం స్పోర్ట్‌పియాలో శిక్షణ తీసుకుంటున్న నిష్క మరింత రాటుదేలేందుకు ప్రయత్నిస్తున్నది.







## భారత్ బోణీ

### మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

రాజ్‌గిర్(బీహార్): మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ)లో భారత హాకీ జట్టు బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో 40తో మలేషియాను ఓడించింది. యువ స్ట్రైకర్ సంగీతా కుమారి రెండు గోల్స్ (8వ, 55వ నిమిషాల్లో) చేయగా ప్రీతి దూబే (43వ ని.), ఉదిత (44వ ని.) తలా ఓ గోల్ చేశారు. మ్యాచ్‌లో తొలి క్వార్టర్స్ నుంచే భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. మలేషియా డిఫెన్స్‌ను ఛేదించుకుంటూ భారత్ గోల్స్ సాధించింది. తొలి పోరులో జయకేతనం ఎగురవేసిన భారత్.. మంగళవారం సౌత్‌కొరియాను ఢీకొననుంది. ఈ టోర్నీలో జపాన్, కొరియా మధ్య జరిగిన మ్యాచ్ 22తో డ్రాగా ముగియగా చైనా..150తో థాయ్‌లాండ్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది.

## బహుమతిగా బంగారు ఐఫోన్..

### సంబురాల్లో యువ ఫుట్‌బాలర్





ప్రపంచ ఫుట్‌బాల్‌లో సంచలనం లామినె యమల్ పేరు వినే ఉంటారు. 17 ఏండ్ల వయసులోనే అదరగొడుతున్న ఈ కుర్రాడు ఈ ఏడాది యూరో చాంపియన్‌షిప్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఓ వైపు చదువుకుంటూనే.. సాకర్‌లో రాణిస్తున్న యమల్ తాజాగా మరోసారి ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాడు. అందుకు కారణం ఏంటంటే.. అతడు అరుదైన బహుమతి అందుకున్నాడు. అవును. ఏకంగా బంగారు ఐఫోన్ ఈ యువకెరటం చేతుల్లో ధగధగ మెరిసిపోతోంది. ఇంతకూ యమల్‌కు ఆ గోల్డెన్ ఐ ఫోన్ ఎవరిచ్చారు? దాని ధర ఎంతంటే...? చిన్నవయసులోనే స్టార్‌డమ్ సంపాదించుకున్న యమల్ స్పెయిన్‌లో మస్త్ పాపులర్. అందుకని ఆ కుర్రాడిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీనియర్ ఆటగాడు రఫిన్హా మరచిపోలేని బహుమతి ఇవ్వాలనుకున్నాడు. అందుకని బాగా ఆలోచించి అతడికి స్వచ్ఛమైన బంగారంతో తయారైన ఐ ఫోన్‌ను యమల్‌కు గిఫ్ట్‌గా అందించాడు. ప్రతిష్ఠాత్మక 'ది బాలన్ డి ఓర్' అవార్డుల వేడుక అనంతరం రఫిన్హా తాను తీసుకొచ్చిన పసిడి ఐఫోన్‌ను యమల్‌కు ఇచ్చాడు.

## చాంపియన్ అరవింద్



చెన్నై: యువ గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం చెన్నై గ్రాండ్ మాస్టర్స్2024 టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. సోమవారం జరిగిన ఈ టోర్నీ ఫైనల్‌లో వరుసగా రెండు విజయాలు నమోదుచేసిన అతడు.. లెవొన్ అరోనియన్ (యూఎస్ఏ)ను ఓడించి టైటిల్ విజేతగా నిలిచాడు. ఆరో రౌండ్‌లో అర్జున్ ఇరిగేసిని ఓడించిన అతడు.. ఏడో రౌండ్‌లో ఇరాన్ ఆటగాడు పర్హామ్ మఘసుద్లూను చిత్తుచేయడంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన నిలిచి టైటిల్ రేసులోకి వచ్చాడు. 4.5 పాయింట్లతో అరవింద్, అరోనియన్, అర్జున్ సాధించడంతో ఫైనల్ పోరు టైబ్రేక్‌కు దారితీసింది. ప్లేఆఫ్‌లో అరవింద్‌కు బై దక్కగా అరోనియన్, అర్జున్ గ్రాండ్ ఫైనల్ కోసం తలపడాల్సి వచ్చింది. ఫైనల్‌లో అర్జున్.. అరోనియన్ మధ్య జరిగిన మూడు మ్యాచ్‌లలో ఒకటి డ్రాగా ముగియగా ఇరువురు తలా ఓ విజయం సాధించి 1.5 పాయింట్లతో సమానంగా నిలిచారు. కానీ రౌండ్ రాబిన్ దశలో మెరుగైన పాయింట్లతో అరోనియన్ గ్రాండ్ ఫైనల్‌కు అర్హత సాధించగా అర్జున్ మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు.



# సినిమా వార్తలు MOVIE NEWS





## భారతీయులంతా అతని సోదరసోదరీమణులు..

### నితిన్ రాబిన్ హుడ్ టీజర్ వచ్చేస్తుంది

టాలీవుడ్ యాక్టర్ నితిన్ నటిస్తోన్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. చాలా రోజుల తర్వాత టీజర్ అప్‌డేట్‌ను షేర్ చేశారు మేకర్స్.

భారతీయులంతా అతని సోదరసోదరీమణులు.. మీ సంపదను అతనితో పంచుకోవడానికి రెడీగా ఉండండి.. అంటూ రాబిన్ హుడ్ టీజర్‌ను నవంబర్ 14న 4:05 గంటలకు లాంచ్ చేస్తున్నాం. అడ్వెంచరస్ ఎంటర్‌టైన్‌మెంట్ వచ్చేస్తుంది.. అంటూ నితిన్ రెడ్ కలర్ హుడీ, బ్లాక్ మాస్క్‌తో ఉన్న స్టిల్ షేర్ చేశారు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది.

లేడీ బాస్ శ్రీలీల స్టైలిష్ అవతార్‌లో హ్యాండ్ బ్యాగ్ వేసుకుని విమానంలో నుంచి దిగుతున్న స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. నటకిరిటీ రాజేంద్రప్రసాద్ ఏజెంట్ జాన్ స్నోగా నటిస్తున్నాడు. వెన్నెల కిశోర్ కీ రోల్‌లో నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యేర్నేని, రవి శంకర్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్‌లో డబ్బు చాలా చెడ్డది.. రూపాయి రూపాయి నువ్వేం చేస్తావే అంటే అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల మధ్య చిచ్చు పెడతానంటది. అన్నట్టే చేసింది.. దేశమంత కుటుంబం నాది. ఆస్తులున్నోళ్లంతా నా అన్నదమ్ముళ్లు. ఆభరణాలు వేసుకున్నోళ్లంతా నా అక్కాచెల్లెళ్లు. అవసరం కొద్దీ వాళ్ల జేబుల్లో చేతులు పెడితే ఫ్యామిలీ మెంబర్ అని కూడా చూడకుండా నా మీద కేసులు పెడుతున్నారు.. అంటూ నితిన్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి.

## ప్రభాస్-పూరీ జగన్నాథ్ కాంబో రిపీట్..

### క్రేజీ టాక్‌లో నిజమెంత..?






తెలుగు సినిమా ఇండస్ట్రీలో వన్ ఆఫ్ ది టాప్ డైరెక్టర్లలో ఒకడు పూరీ జగన్నాథ్. తన కెరీర్‌లో ఎంతో మంది యాక్టర్లకు బ్రేక్ అందించాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా డాషింగ్ డైరెక్టర్‌కు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తుంది. పూరీ గ్లోబల్ స్టార్ ప్రభాస్‌తో మరోసారి పనిచేయబోతున్నాడన్న క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ సర్కిల్‌లో హల్ చల్ చేస్తుంది.

అయితే ఈ ఇద్దరు ఏం సినిమా చేస్తున్నారనే కదా మీ డౌటు. స్పిరిట్ ప్రాజెక్ట్. అదేంటి అనుకుంటున్నారా..? మీరు చదివింది నిజమే. ఈ సినిమాకు పూరీ డైలాగ్స్ రాస్తున్నాడట. కాప్ డ్రామా నేపథ్యంలో వచ్చిన పోకిరి, టెంపర్ డైలాగ్స్ బాక్సాఫీస్‌ను ఏ స్థాయిలో షేక్ చేశాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మళ్లీ ఇదే జోనర్‌లో రాబోతున్న స్పిరిట్ సినిమా కోసం డైలాగ్స్ రాసే విషయమై డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇటీవలే పూరీని సంప్రదించగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్ సైడ్ టాక్. ఇదే నిజమైతే కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న స్పిరిట్‌ను పూరీ డైలాగ్స్ మరో రేంజ్‌కు తీసుకెళ్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే ప్రభాస్‌పూరీ కాంబోలో వచ్చిన ఏక్ నిరంజన్, బుజ్జిగాడు సినిమాల్లోని డైలాగ్స్ ఎంత పాపులర్ అయ్యాయో తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోలో వచ్చే డైలాగ్స్ ఎలా ఉండబోతున్నాయన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది.

## గజపతిగా మంచు మనోజ్

### ట్రెండింగ్‌లో భైరవం మాసీ లుక్



ఉగ్రం ఫేం విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న చిత్రం భైరవం. నారా రోహిత్, బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఇంటెన్సివ్‌గా సాగే పాత్రలు, కోసం సిద్ధంగా ఉండండి.. బ్లాస్టింగ్ అప్‌డేట్స్‌తో త్వరలో మీ ముందుకు రాబోతుందంటూ మేకర్స్ ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన బెల్లంకొండ శ్రీనివాస్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ పోస్టర్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా మంచు మనోజ్ లుక్ కూడా షేర్ చేశారు. ఇందులో మనోజ్ గజపతిగా కనిపించబోతున్నాడు. మాస్ ఫీస్ట్‌లా మనోజ్ పాత్ర ఉండబోతుందని చెప్పకనే చెబుతున్నాడు డైరెక్టర్. భారీ వర్షంలో కారు, దాని పక్కనే గొడుగులు పట్టుకొస్తున్న జనాలు.. వాటి ముందు ఆవేశంగా వస్తున్న గజపతి లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. థ్రిల్లింగ్ యాక్షన్ ప్యాక్డ్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో నారా రోహిత్ వరదగా కనిపించబోతున్నాడు. ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు.



## సుకుమార్ కోసం ఆ సినిమా ఆపేశాను: నిర్మాత 'దిల్' రాజు

'ఆర్య' సినిమాతో దర్శకుడు సుకుమార్‌ను సినీ పరిశ్రమకు పరిచయం చేశాడు నిర్మాత దిల్ రాజు. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ప్రేమకథా చిత్రాల్లో ఎంతటి సంచలన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'ఆర్య' సినిమా తరువాత దిల్ రాజు సుకుమార్ కాంబోలో మరో సినిమా రాలేదు. అయితే ప్రస్తుతం సుకుమార్, అల్లు అర్జున్‌తో తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం పుష్ప 2 ది రూల్ ఈ చిత్రం చిత్రీకరణలో బిజీగా వున్నాడు. ఒకవైపు షూటింగ్‌తో పాటు మరోవైపు నిర్మాణానంతర పనులతో తలమునకలై వున్నాడు ఈ దర్శకుడు. అయితే తాను సుకుమార్ రైటింగ్స్‌తో అసోసియేషన్‌తో నిర్మిస్తున్న 'సెల్ఫిష్' చిత్రం చిత్రీకరణను ఆపేశానని తెలియజేశారు దిల్‌రాజు. వివరాల్లోకి వెళితే.. దిల్ రాజు సోదరుడు శిరీష్ తనయుడు ఆశిష్ రెడ్డి హీరోగా సుకుమార్ శిష్యుడు కాశీ దర్శకత్వంలో సెల్ఫిష్ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు దిల్ రాజు. ఇప్పటి వరకు యాభై శాతం చిత్రీకరణ పూర్తయిన ఈ చిత్రం బ్యాలెన్స్ వర్క్ పుష్ప 2 విడుదల తరువాత మళ్లీ మొదలు పెడతానని తెలియజేశారు దిల్ రాజు.